

పెరుగుతున్న గోదావరి ప్రవాహం

'పోలవరం' నుండి 1,90,566 క్యూసెక్కులు విడుదల

ప్రజాశక్తి - పోలవరం

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి నీటిమట్టం గురువారం సాయంత్రానికి క్రమక్రమంగా పెరుగుతోంది. ఎగువ రాష్ట్రాలు, ఎగువ ప్రాంతాల నుండి వస్తున్న మంజీర, శబరి, సీలేరు, ప్రవర, ఇంద్రావతి జలాలు గోదావరిలో కలుస్తుండడంతో గోదావరి నీటిమట్టం పెరుగుతోంది. ప్రాజెక్టులోకి అదనంగా వస్తున్న 1,90,566 క్యూసెక్కుల వరద జలాలను దిగువకు విడుదల చేసినట్లు జలవనరుల శాఖాధికారులు తెలిపారు. ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 27.950 మీటర్లు, స్పిల్వే దిగువన 18.120 మీటర్లు నీటిమట్టం నమోదైంది.

ప్రహసనంలా సహకార కమిటీలు..!

- రెండు జిల్లాల్లో 66 సంఘాలకు ఇంకా కమిటీలు నియమించని పరిస్థితి
- రాజకీయ నేతల్లో కొనసాగుతున్న ఉత్కంఠ
- జనవరి 30 వరకూ మాత్రమే త్రిసభ్య కమిటీల గడువు
- తర్వాతైనా ఎన్నికలు నిర్వహిస్తారా అని అనుమానాలు
- రాజకీయ పునరావాసంగా సహకార సంఘాలు
- వ్యవసాయంపై అవగాహన లేనోళ్లకు సహకార పదవులా?



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీల నియామకం ఒక ప్రహసనంలా మారింది. జులై తొమ్మిదో తేదీన మొదటి జాబితా విడుదలవ్వగా ఇప్పటికీ కమిటీల నియామకం పూర్తికాని పరిస్థితి ఉంది. దీంతో కూటమి నేతల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. ఇప్పటికీ ఏలూరు జిల్లాలో 47 సంఘాలు, పశ్చిమగోదావరి జిల్లాలో 19 సంఘాలకు త్రిసభ్య కమిటీల నియామకం పూర్తి కాలేదు. నిబంధనల ప్రకారం జనవరి 30వ తేదీ వరకే త్రిసభ్య కమిటీల పదవీకాలం ఉంది. కమిటీల నియామకం ఆలస్యం కావడంతో తమకు పదవీకాలం విషయంలో నష్టం జరుగుతుందని పదవులు ఆశిస్తున్న నేతలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలల తర్వాత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తారా... లేక వైసిపి బాటలోనే త్రిసభ్య కమిటీలతో కూటమి ప్రభుత్వం కాలక్షేపం చేస్తుందా అనే అనుమానాలు నెలకొన్నాయి. వ్యవసాయంపై అవగాహన లేని వ్యక్తులను త్రిసభ్య కమిటీల్లో నియమించడంపైనా తీవ్ర చర్చ సాగుతోంది. రైతులకు అండగా నిలవాల్సిన సహకార సంఘాలు రాజకీయ పార్టీల నేతలకు పునరావాసంగా మారాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వాల తీరుతో సహకార సంఘాల ఎన్నికలపై పూర్తిగా నీలినీడలు కమ్ముకున్నాయి. ఏలూరు జిల్లాలో 158, పశ్చిమగోదావరి జిల్లాలో 122 సహకార సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాలకు 2013 జనవరిలో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికలు జరిగాయి. 2018 జనవరితో సహకార సంఘాల పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. మరో ఏడాది 2019లో అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో అప్పట్లో అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా పదవీకాలాన్ని పొడిగించింది. 2019లో జరిగిన సాధారణ ఎన్నికల్లో వైసిపి అధికారంలోకి వచ్చింది. దీంతో సహకార సంఘాలకు ఎన్నికలు జరుగుతాయని అంతా భావించారు. ఐదేళ్లపాటు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ వైసిపి ప్రభుత్వం ముందుకు సాగింది. దీనిపై రైతుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. త్రిసభ్య కమిటీ నియామకంతో సహకార సంఘాల్లో అవినీతి మరింత పెరిగిందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. 2024 ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం ఓటమిపాలై, కూటమి అధికారంలోకి వచ్చింది. దీంతో సాగునీటి సంఘాల ఎన్నికలతోపాటు, సహకార సంఘాల ఎన్నికలను ప్రభుత్వం నిర్వహిస్తుందని అంతా భావించారు.

ఏడాది కాలం ప్రత్యేక అధికారుల పాలన.. ఇప్పుడు త్రిసభ్య కమిటీలు

కూటమి అధికారంలోకి వచ్చాక వైసిపి పాలనలో నియమించిన త్రిసభ్య కమిటీలను రద్దు చేసి ప్రత్యేక అధికారులను నియమించింది. దీంతో ఎన్నికలు నిర్వహణ తథ్యమని అంతా భావించారు. ఏడాదిపాటు ప్రత్యేక అధికారుల పాలన సాగించిన కూటమి ప్రభుత్వం సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించకుండా త్రిసభ్య కమిటీల నియామకానికి దిగింది. ఇది రైతుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఎంఎల్ఎలు తమ అనుయాయుల పేర్లను త్రిసభ్య కమిటీలకు సిఫార్సు చేస్తూ ప్రభుత్వానికి పంపించారు. త్రిసభ్య కమిటీల్లో ఛైర్మన్, సభ్యులుగా ఉన్నవారిలో చాలామందికి వ్యవసాయంపై సరైన అవగాహన లేదంటే ఆశ్చర్యపోవాల్సిందే. వ్యాపారాలు, ఇతర వ్యాపకాల్లో ఉండేవారిని సహకార సంఘాల కమిటీల్లో నియమించారు. ఏడాది కాలం తర్వాత త్రిసభ్య కమిటీలను నియమించడం ఏమిటో ఎవ్వరికీ అర్థం కాలేదు. త్రిసభ్య కమిటీల పదవీకాలం ఆరు నెలలుగా ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. జనవరి 30వ తేదీతో గడువు ముగియనుంది. అప్పుడైనా సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తారో, లేదో తెలియని పరిస్థితి నెలకొంది. అదే సమయంలో త్రిసభ్య కమిటీల నియామకంలో తాత్సారంపై రాజకీయ పార్టీల్లో తీవ్ర చర్చ సాగుతోంది.



విద్యుద్దీపాల వెలుగులో కలెక్టరేట్

నేడు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

జెండా ఆవిష్కరించనున్న మంత్రికొలుసు పార్థసారథి

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

స్థానిక పోలీసు పెరేడ్ మైదానంలో శుక్రవారం 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జాతీయ పతాకాన్ని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ఆవిష్కరించనున్నారు. శుక్రవారం ఉదయం 8.45 గంటలకు మంత్రి కొలుసు పార్థసారథి పోలీస్ పెరేడ్ మైదానానికి చేరుకుంటారు. 9 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం పోలీస్ గౌరవ వందనం స్వీకరిస్తారు. అనంతరం 9.15 గంటలకు ప్రసంగం, 9.30కు పోలీస్ కవాతు, పది గంటలకు వివిధ శాఖల ప్రగతి శకటాల ప్రదర్శన, 10.20 గంటలకు విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు, 10.55కు ప్రశంసాపత్రాల ప్రదానం, 11.15కు వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శన, అనంతరం జాతీయ గీతాలాపనతో కార్యక్రమాలు పూర్తవుతాయి.

స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. భారీ వర్షాల నేపథ్యంలో తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. కలెక్టర్ వెంట ఎఎస్‌పి నక్కా సూర్యచంద్రరావు, ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, డిఎస్‌పి శ్రావణ్ కుమార్, ఎఆర్ డిఎస్‌పి చంద్రశేఖర్, ఆర్ఐ పవన్ కుమార్, తహశీల్దార్ గాయత్రి పాల్గొన్నారు.

స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్‌శివ కిషోర్ గురువారం పరిశీలించారు. పోలీస్ కవాతు రిహార్సల్స్ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీటింగ్ ఏర్పాట్లు ప్రొటోకాల్ ప్రకారం చేపట్టాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాలను కేటాయించాలన్నారు. ఆయన వెంట ఎఎస్‌పి ఎన్.సూర్యచంద్రరావు, ఎఆర్ డిఎస్‌పి చంద్రశేఖర్, ఆర్ఐ పవన్‌కుమార్, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వానొచ్చే.. వరదొచ్చే..!

కుండపోతతో లోతట్టు ప్రాంతాలు, వరి పొలాలు జలమయం

ఉప్పొంగిన కొండవాగులు.. నిలిచిన రాకపోకలు



జీలుగుమిల్లి: కొట్టుకుపోయిన కల్వర్టు



టి.నరసాపురం: పొంగిన ముగ్గురాళ్ల వాగు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అల్పపీడన ప్రభావంతో మండలవ్యాప్తంగా బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. వర్షానికి రహదారులన్నీ జలమయమయ్యాయి. చెరువులు, వాగులు, వంకల్లోకి వరద నీరు వచ్చి చేరింది. ఎగువన కూడా భారీ వర్షాలు కురుస్తుండటంతో కామయ్యపాలెం వాగు, అశ్వారావుపేట వాగు, సంగం వాగుల గుండా వరద నీరు పోటెత్తింది. వంకవారిగూడెం వద్ద కల్వర్టు గతేడాది కొట్టుకుపోవడంతో తాత్కాలిక మరమ్మతులు చేసిన సంగతి తెలిసిందే. మళ్లీ వరద పోటెత్తడంతో కల్వర్టు మరోసారి కొట్టుకుపోయింది. దీంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. అదేవిధంగా మండలంలోని తాటియాకులగూడెం వద్ద జాతీయ రహదారిపై వేపచెట్టు పడి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఎస్ఐ వి.క్రాంతికుమార్ తన సిబ్బందితో ఘటన స్థలికి వెళ్లి చెట్టును తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

ఉప్పొంగిన ముగ్గురాళ్ల వాగు

టి.నరసాపురం: భారీ వర్షాలకు ముగ్గురాళ్ల వాగు పొంగి ప్రవహిస్తోంది. బండివారిగూడెం, మక్కినవారిగూడెం గ్రామాల మధ్య ఈ వాగు ఉప్పొంగడంతో ఆ మార్గంలో వాహన రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న అధికారులు తహశీల్దార్ టి.సాయిబాబా, పోలీసు సిబ్బంది అక్కడ పరిస్థితిని పరిశీలించి, ఆ మార్గంలో ఎవరూ వాగు దాటే ప్రయత్నం చేయొద్దని హెచ్చరించారు.

ముదినేపల్లి: మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి డ్రెయిన్లన్నీ పొంగిపొర్లుతున్నాయి. మంగళవారం రాత్రి కురిసిన కుండపోత వర్షానికి చేలల్లో భారీగా వర్షపు నీరు చేరింది. బుధ, గురువారం కూడా వర్షాలు కురవడంతో డ్రెయిన్లన్నీ నిండుగా ప్రవహిస్తున్నాయి. మండలంలోని మేజర్, మైనర్, మీడియం డ్రెయిన్లన్నీ పొంగిపొర్లడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. చేలు ముంపు బారిన పడ్డాయి. ముదినేపల్లి అంబేద్కర్ నగర్ సమీపంలోని నాట్లు వేసిన వరి చేలు నీట మునిగాయి. ఇదే పరిస్థితి కొన్ని రోజులు కొనసాగితే నాట్లు కుళ్లిపోయే ప్రమాదం ఉందని అంతా ఆందోళన చెందుతున్నారు. పోల్‌రాజ్ మురుగు కాలువ ఆయకట్టు పొలాల్లో వరద నీరు భారీగా ఉంది. అధికారులు స్పందించి వెంటనే పోలరాజ్ డ్రెయిన్లో అడ్డంకులు తొలగించి, పూడికతీత పనులు చేపట్టి చేలల్లో వరద నీరు బయటకు పోయేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నూజివీడు టౌన్: నూజివీడు డివిజన్ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు నమోదయ్యాయి. నూజివీడు డివిజన్లో మొత్తం 331.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవ్వగా సరాసరి వర్షపాతం 55.3 మిల్లీమీటర్లుగా నమోదైంది. అత్యధికంగా ముసునూరులో 78.8 మిల్లీమీటర్లు, అత్యల్పంగా నూజివీడులో 41.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. చింతలపూడి మండలంలో 57.2, చాట్రాయి మండలంలో 55.6, లింగపాలెంలో 53.6, ఆగిరిపల్లిలో 45.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



నీట మునిగిన పొలాలు

సబ్‌కలెక్టర్‌చే లోతట్టు ప్రాంతాల పరిశీలన



పరిశీలిస్తున్న వినూత్న

నూజివీడు టౌన్: పట్టణ పరిధిలోని లోతట్టు ప్రాంతాలను సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న గురువారం పరిశీలించారు. పట్టణ పరిధిలోని మొగళ్ల చెరువు, పెద్ద చెరువు, గొడుగువారిగూడెం, ఆర్‌ఆర్‌పేట, ఎంప్లాయిస్ కాలనీ, తిరువూరు బస్టాండ్ రోడ్డు, బైపాస్ రోడ్డు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం ఎలాంటి నష్టాలు సంభవించకుండా తగిన జాగ్రత్త చర్యలు చేపట్టామన్నారు. చెరువుల వద్ద కట్టలు పటిష్టంగా ఉండేందుకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ఎదుర్కొనేందుకు యంత్రాంగం సన్నద్ధంగా ఉందని తెలిపారు. ఆమె వెంట ఇరిగేషన్ డిఇ అర్జునరావు, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

17న 'ట్రంప్ సుంకాలు-ఆక్వా కుదేలు'పై రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

'ట్రంప్ సుంకాలు-ఆక్వా కుదేలు' అనే అంశంపై సిపిఎం ఆధ్వర్యంలో జరిగే రౌండ్‌టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 17వ తేదీ ఆదివారం ఉదయం 11 గంటలకు ఏలూరులోని పవర్‌పేటలో సిపిఎం జిల్లా కార్యాలయంలో ట్రంప్ సుంకాలు-ఆక్వా కుదేలు అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మన దేశం నుండి అమెరికాకు ఎగుమతి అవుతున్న వ్యవసాయ, ఆక్వా తదితర ఉత్పత్తులపై పన్నులు 50 శాతానికిపైగా వేయడంతో ఆక్వా పరిశ్రమ ఒక్కసారిగా కుదేలైందని తెలిపారు. ఆక్వా పరిశ్రమ సంక్షోభంలో పడి రైతులు దివాళా తీసే ప్రమాదం ఏర్పడిందని పేర్కొన్నారు. దీనివల్ల మన దేశ ఆర్థిక వ్యవస్థ దిగజారిపోతుందని నిపుణుల అభిప్రాయపడుతున్నట్లు తెలిపారు. ప్రపంచ ఆధిపత్యం కోసం అమెరికా మనలాంటి దేశాల నడ్డివిరగ్గొడుతుందని, ఒకవైపు స్నేహ హస్తం చూపిస్తూ మరోవైపు కాళ్లు విరగ్గొట్టడం ట్రంప్‌కే చెల్లిందని ఎద్దేవా చేశారు. ట్రంప్ ఎంత దుర్మార్గం చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాట్లాడకుండా మౌనం వహించడం మరింత ఆందోళనకరమైన విషయమని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చి ఆక్వా రంగాన్ని పరిరక్షించుకోవడానికి రాజకీయాలకు అతీతంగా రైతులు, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలంతా ఏకం కావాల్సిన అవసరం ఏర్పడిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేసిన ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి ఆక్వా రైతులు, వివిధ రాజకీయ పార్టీల, ప్రజాసంఘాల నేతలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



భూములను పరిశీలిస్తున్న సిపిఎం నేతలు


పేదలకు పట్టాలివ్వకుండా కార్పొరేట్లకు భూములివ్వడం తగదు

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఏళ్ల తరబడి పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వకుండా, కార్పొరేట్లకు, పెట్టుబడిదారులకు కారుచౌకగా భూములు కట్టబెట్టే పనిలో కూటమి ప్రభుత్వం ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం మండల పరిధిలోని తోటపల్లి గ్రామంలో మంత్రి పార్థసారథి కుమారుడు నితిన్ కృష్ణ కన్‌స్ట్రక్షన్స్ అధినేత కొలుసు నితిన్‌కృష్ణకు బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం కేటాయించిన భూములను సిపిఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే వారు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటును ఈ ప్రాంత ప్రజలు వ్యతిరేకిస్తున్నారని, ప్లాంట్ ఏర్పాటు వల్ల భవిష్యత్‌లో ఏర్పడే వాతావరణ కాలుష్య సమస్యపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్పొరేట్లకు కట్టబెట్టే భూములను పేదలకు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జహాంగీర్ భాషా, కోటేశ్వరరావు, బోసు, శ్రీనివాసరావు, నరేష్, శామ్యూల్, రంగారావు, మోహనరావు, కృష్ణ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యావ్యవస్థకు ప్రణాళిక : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

నాణ్యమైన విద్యావ్యవస్థకు ప్రణాళికాబద్ధంగా పని చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో గురువారం వికసిత్ భారత్-2047 లక్ష్యంగా 'స్కూలింగ్-బిల్డింగు బ్లాక్స్' అనే అంశంపై జిల్లాలోని విద్యా శాఖాధికారులతో నిర్వహించిన ఒక్కరోజు వర్క్‌షాప్‌లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రధాని, ముఖ్యమంత్రి వ్యక్తీకరించిన 'వికసిత్ భారత్-2047' దార్శనికత, భారతదేశాన్ని వందో స్వాతంత్ర దినోత్సవంతో సమానంగా 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశాల్లో మన భారతదేశం మొదటి స్థానంలో నిలిచే లక్ష్యంగా అన్ని రంగాల్లో నిరంతర లక్ష్యాలు, నిర్దేశం, సాధన చాలా అవసరమన్నారు. మానవ వనరుల అభివృద్ధి యువత, వయోజనులు, మహిళలపై నిర్మితమై ఉందన్నారు. వికసిత్ భారత్‌ను సాధించడానికి ఆర్థిక వృద్ధిని, సామాజిక సమానత్వం, ప్రపంచ పోటీతత్వం, పర్యావరణ స్థిరత్వం, పారిశ్రామిక ఆధునికీకరణ, సుపరిపాలన, భారతదేశం ప్రపంచ జ్ఞాన సూపర్ పవర్‌గా ఆవిర్భవించడానికి సమగ్రమైన విధానం అవసరమన్నారు. దీని నిర్మాణంలో అత్యంత కీలకమైంది నాణ్యమైన పాఠశాల విద్యతోపాటు చక్కని భవనాలు, పూర్తిగా మౌలిక సదుపాయాలు అవసరమన్నారు. 3-18 సంవత్సరాల వయస్సు గల ప్రతి బిడ్డకూ అందుబాటులో ఉండే, నాణ్యమైన విద్య, నైపుణ్య అవకాశాలను పటిష్టపర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. శ్రామిక శక్తి, సామాజిక, భావోద్వేగ సామర్థ్యాలను పెంపొందించడంలో పాఠశాల విద్య ప్రారంభం అత్యంత కీలకమైన దశ అన్నారు. ఈ లక్ష్యంతో జాతీయ విద్యా విధానం ద్వారా పాఠశాల విద్యలో ఒక సమూల పరివర్తనను తీసుకొచ్చేందుకు విద్యా వ్యవస్థను లక్ష్యంగా చేసుకుని, అందరికీ అధిక నాణ్యమైన విద్యను అందించడం ద్వారా భారతదేశాన్ని ప్రపంచ జ్ఞాన సూపర్ పవర్‌గా మార్చేందుకు లక్ష్యంగా పెట్టుకుందన్నారు. పాఠశాల విద్య అన్ని దశల్లో నాణ్యమైన విద్య అత్యంత ప్రాముఖ్యతను గుర్తించి ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. ప్రతి విద్యార్థికీ ప్రాథమిక విద్య స్థాయి నుండే పరిపక్వత చెందుతుందని అన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి వారికి విద్య, కనీస అవసరాలను కల్పించి అందరితో కలిసి సమానంగా చదువుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. దీనిలో అంగన్వాడీలు, ప్రాథమిక పాఠశాలలు, పాఠశాలలు ప్రధాన భూమికను పోషిస్తాయన్నారు. అంగన్వాడీలు, పాఠశాలల్లో డ్రాపౌట్స్ లేకుండా నూరుశాతం హాజరు సాధించాలన్నారు. పిల్లల మానసిక వికాసానికి తల్లి పాత్ర ఎంతో కీలకమని, పిల్లలతో కొంత సమయాన్ని తల్లిదండ్రులు తప్పక గడిపేలా చూడాలని అన్నారు. విద్యార్థి దశలో ఆరోగ్యంగా ఉండడం ఎంతో కీలకమైందన్నారు. ప్రతిఒక్క విద్యార్థీ గణితంతోపాటు అన్ని భాషలపై పట్టు సాధించేలా బోధించాలన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్ మీద దృష్టి సారించేలా చూడాలని, ప్రతి పాఠశాలలో డిజిటల్ టెక్నాలజీ అందుబాటులో ఉందని విజువలైజేషన్ ద్వారా విద్యను అందిస్తే ఎక్కువగా గ్రహించగలుగుతారని సూచించారు. ఆచరణీయమైన చక్కని సలహాలు, సూచనలు తెలియజేయాలని, నివేదిక రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎం.వెంకటలక్ష్మమ్మ, సర్వశిక్షాభియాన్ ఎపిసి డాక్టర్ కె.పంకజ్‌కుమార్, జెడ్‌పి సిఇఒ ఎం.శ్రీహరి, సోషల్ వెల్ఫేర్ జెడి విశ్వమోహన్‌రెడ్డి, ఐసిడిఎస్ పీడీ ఎ.శారద, అకడమిక్ మోనిటరింగ్ అధికారి ఆర్.రామారావు, డివైఇఒలు, ఎంఇఒలు, ప్రధానోపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

కాగుపాడు పంచాయతీ నిధులు దుర్వినియోగం

లెక్కతేల్చిన అధికారులు

రూ.15,54,244 రికవరీకి ఆదేశాలు

సర్పంచి చెక్‌పవర్ రద్దు

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని కాగుపాడు పంచాయతీ నిధుల దుర్వినియోగంపై ఆ గ్రామానికి చెందిన రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి వంకిన మాధవరావు ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన అధికారులు రూ.15,54,244 దుర్వినియోగమైనట్లు గుర్తించారు. ఆ సొమ్ముకు సంబంధించి సరైన రికార్డులు అందజేయకపోవడంపై రికవరీ చేయాలని జిల్లా పంచాయతీ అధికారి కె.అనూరాధ ఆదేశాలు జారీ చేశారు. గ్రామ సర్పంచి కడియాల సుదేష్ణ, అప్పటి పంచాయతీ కార్యదర్శులు జి.బాలకృష్ణ, వి.శ్రీదేవి అనేక అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ వంకిన మాధవరావు ఫిర్యాదు చేశారు.య దీనిపై నూజివీడు, జంగారెడ్డిగూడెం డిఎల్‌పిఒలు విచారణ చేపట్టి నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. అనుమతి లేకుండా పంచాయతీ భవనాన్ని తొలగించినందుకు సర్పంచి సుదేష్ణను సస్పెండ్ చేస్తూ ఏప్రిల్ 7న అధికారులు ఉత్తర్వులిచ్చారు. తాజాగా ఆమెకు మళ్లీ సర్పంచిగా బాధ్యతలు పునరుద్దరిస్తూ అధికారులు ఈ నెల 11న ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పంచాయతీ నిధులను ఖర్చు పెట్టి, అందుకు సరైన బిల్లులు, లెక్కలు చూపని కారణంగా సర్పంచి కె.సుదేష్ణ రూ.7,77,122, అప్పటి కార్యదర్శులు జి.బాలకృష్ణ రూ.1,42,014, వి.శ్రీదేవి రూ.6,35,108 నిధులు పక్కదారి పట్టించినట్లు నిర్ధారించారు. సర్పంచి చెక్ పవర్ ఆరు నెలల పాటు రద్దు చేసినట్లు డిపిఒ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అంతవరకూ డిప్యూటీ ఎంపిడిఒకు డ్రాయింగ్ పవర్ అప్పగించారు. వీటిపై సర్పంచి వారం రోజుల్లో జిల్లా కలెక్టర్‌కు అప్పీల్ చేసుకునే అవకాశం ఇచ్చారు.

నేడు ఏలూరులో స్త్రీ శక్తి ప్రారంభం

విచ్చేయనున్న మంత్రి కొలుసు పార్థసారథి, ఏడుగురు ఎంఎల్‌ఎలు

ఏలూరు అర్బన్: సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకాన్ని ఏలూరు కొత్తబస్టాండ్‌లో శుక్రవారం మంత్రి కొలుసు పార్థసారథి ప్రారంభించనున్నారు. మంత్రితోపాటు జిల్లాలోని ఏడుగురు ఎంఎల్‌ఎలను ఏలూరు ఆహ్వానించామని, ఏడు నియోజకవర్గాలకు ఏడు బస్సులను ప్రారంభిస్తారని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎస్‌కె.షబ్నం తెలిపారు. ఉచిత బస్సు పథకంలో బాలికలు, మహిళలు, ట్రాన్స్‌జెండర్స్ రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు కార్డులైన ఆధార్, ఓటర్ కార్డులను చూపించి జీరో టిక్కెట్ తీసుకుని ప్రయాణించవచ్చని తెలిపారు.

సెల్ టవర్ నిర్మించొద్దని అక్కిరెడ్డిగూడెంవాసుల తీర్మానం

ప్రజాశక్తి - ముసునూరు

సెల్‌టవర్ నిర్మిస్తే తమకు రేడియేషన్ ద్వారా అనారోగ్యానికి గురవుతామని అక్కిరెడ్డిగూడెం వాసులు తీర్మానించారు. గురువారం ఆ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సర్పంచి పులి బళ్లలక్ష్మీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో నూతనంగా ఇండోస్ టవర్స్ లిమిటెడ్ ఆఫ్ హైదరాబాద్ వారిచే సెల్‌టవర్ నిర్మాణ పనులు ప్రారంభించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. సెల్‌టవర్ నిర్మించొద్దని తీర్మానం చేశారు. ఈ తీర్మానాన్ని ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణకు పంపుతామని పంచాయతీ కార్యదర్శి షేక్ ముబీనా తెలిపారు.




మాట్లాడుతున్న గ్రామస్తులు

జనసురక్షతో సామాన్యులకు భరోసా: ఎల్‌డిఎం

ప్రజాశక్తి - దెందులూరు

జన సురక్ష పథకాల ద్వారా సామాన్య ప్రజలకు భద్రత, భరోసా కల్పిస్తామని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ డి.నీలాద్రి అన్నారు. దెందులూరు మండలం గాలాయగూడెంలో బ్యాంకు ఆఫ్ బరోడా ఆధ్వర్యంలో గురువారం జనసురక్ష పథకాలపై అవగాహనా కార్యక్రమంనిర్వహించారు. ఈ సందర్భంగా నీలాద్రి మాట్లాడుతూ అటల్ పెన్షన్ యోజన పథకం ద్వారా 60 ఏళ్ల తర్వాత నెలకు రూ.వెయ్యి నుంచి రూ.5 వేల వరకూ కనీస పెన్షన్ లభిస్తుందన్నారు. చందాదారులు మరణిస్తే జీవిత భాగస్వామికి అదే పెన్షన్ లభిస్తుందని, చందాదారుడి, అతని జీవిత భాగస్వామి మరణించిన తరువాత, నామినీ 60 సంవత్సరాల వయస్సు వరకు సేకరించిన పెన్షన్ సంపదను అందుకుంటారని తెలిపారు. వివిధ పథకాల గురించి వివరించారు. ఆన్‌లైన్, సైబర్ మోసగాళ్ల బారిన పడకుండా ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నీలాద్రి కోరారు.


డిఇఒకు వినతిపత్రం అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

యుటిఎఫ్ నేతపై ఎస్‌టియు తప్పుడు ప్రచారం తగదు

అలాంటివారిపై చర్యలు తీసుకోవాలి

డిఇఒకు యుటిఎఫ్ నేతల వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

యుటిఎఫ్ నగర ప్రధాన కార్యదర్శి జొన్నకూటి రాజారావుపై ఎస్‌టియు జిల్లా నాయకత్వం సోషల్ మీడియాలో తప్పుడు, దూషణాత్మక ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బేతాళ సుదర్శనం స్పష్టం చేశారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మకు వినతి పత్రం అందించి దళిత ఉద్యోగిపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సుదర్శనం మాట్లాడుతూ ఎస్‌టియు జిల్లా నాయకులు నారాయణ, పవన్, రాఘవ, సత్యనారాయణ, నాగరాజు, కుసుమాకర్‌లు రాజారావుపై కుల ఆధారిత వేధింపులు, నిరాధార ఆరోపణలకు పాల్పడుతున్నారన్నారు. ఇవి 1989 ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టానికి విరుద్ధమని, ఈ వేధింపులు ఆగకపోతే రాష్ట్ర, జాతీయ ఎస్‌సి కమిషన్ల దృష్టికి తీసుకెళ్తామని, అలాగే ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం కింద క్రిమినల్ కేసులు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఆర్‌ఎస్ ఆఫీసర్ చాగంటి సంజీవ్, బేతాళ నాగరాజు, డిఎస్‌విడి.ప్రసాద్, జొన్నకూటి రాజారావు పాల్గొన్నారు.


ముదినేపల్లిలో...

పలుచోట్ల హర్ ఘర్ తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండల కేంద్రమైన ముదినేపల్లిలో గురువారం హర్ ఘర్ తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ముదినేపల్లి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి జి.రమేష్, సచివాలయ ఉద్యోగులు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు జాతీయ జెండా చేత పట్టుకుని గ్రామంలో ర్యాలీ చేశారు.

చింతలపూడి :దేశంలోని పౌరులందరూ తమ ఇంటి వద్ద జాతీయ జెండాను పెట్టడం ద్వారా జాతీయభావం ఉట్టిపడుతుందని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. గురువారం నిర్వహించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చింతలపూడి అంథోనినగర్ వద్ద హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొని తన దేశ భక్తిని చాటారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ దేశభక్తి కలిగి జాతీయ సమైక్యతకు, సమగ్రతకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

గోడ కూలి యువకుడు మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

టెంట్లు తీస్తున్న యువకుడిపై గోడ ఒక్కసారిగా కూలిపోవడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన నగరంలోని తంగళ్లమూడి ప్రాంతంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన కోన సాయి (22) బాల బాలాజీ టిప్ టాప్ కంపెనీలో టెంట్లు వేసే కూలీగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో తంగళ్లమూడి ప్రాంతంలో నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన కోసం చేసే పూజకు బుధవారం టెంట్లు వేశారు. అనంతరం గురువారం ఆ టెంట్లను సాయి తొలగిస్తున్నాడు. ఈ క్రమంలో అప్పటికే కొంత భాగం కూలిపోయి ఉన్న గోడ బుధవారం వర్షానికి పూర్తిగా నానిపోయి ఒక్కసారిగా అతనిపై కూలిపోయింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రెండో పట్టణ సిఐ అశోక్‌కుమార్, ఎస్‌ఐ మధు వెంకటరాజులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు.

అంతర్ జిల్లాల దొంగ అరెస్ట్

రూ.5,900 నగదు, బైక్ స్వాధీనం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

అంతర్ జిల్లాల దొంగను అరెస్టు చేసిన పోలీసులు అతని వద్ద నుంచి రూ.5,900 నగదు, చోరీ చేసిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నూజివీడు పట్టణంలోని రూరల్ సర్కిల్ కార్యాలయంలో నూజివీడు డిఎస్‌పి కెవివిఎన్‌వి.ప్రసాద్ గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. చాట్రాయి గ్రామంలో ఆంజనేయస్వామి గుడి వద్ద ఈ నెల 13వ తేదీన వాహనాలను తనిఖీ చేస్తుండగా ఏలూరు నగరానికి చెందిన అంతర్ జిల్లా దొంగ పటాన్ సలార్‌ఖాన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఏలూరు నగరానికి చెందిన పటాన్ సలార్ ఖాన్ దేవాలయాలు, పలు ప్రార్థన మందిరాలను టార్గెట్ చేసి చోరీలకు పాల్పడుతుంటాడు. యాత్రికులు సమర్పించే కానుకలు, హుండీల్లోని నగదు చోరీ చేయడమే సలార్ ఖాన్ వృత్తిగా ఎంచుకున్నాడు. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన సమాచారం, ఆదేశం మేరకు ప్రత్యేక బృందాలతో వల పన్ని సలార్ ఖాన్‌ను అదుపులోకి తీసుకున్నట్లు డిఎస్‌పి చెప్పారు. సలార్ ఖాన్ గతంలో అనేక చోరీ కేసులతో సంబంధం ఉన్నట్లు వివరించారు. సలార్ ఖాన్‌ను అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.5,900 నగదు, చోరీ చేసిన మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సలార్ ఖాన్ ఏలూరు జిల్లాలో 25, నెల్లూరు జిల్లాలో 23, ఎన్‌టిఆర్ జిల్లాలో మూడు కేసులతో సంబంధాలు ఉన్నట్లు వెల్లడించారు. ఆ జిల్లాలకు చెందిన పోలీసు అధికారులతో చర్చించి కేసు విచారణ కొనసాగించనున్నట్లు తెలిపారు. సలార్ ఖాన్ అరెస్ట్‌లో నూజివీడు రూరల్ సిఐ కె.రామకృష్ణ, చాట్రాయి ఎస్‌ఐ డి.రామకృష్ణ కృషి ప్రశంసనీయమన్నారు. హెడ్ కానిస్టేబుల్ ఎం.విజయభాస్కర్, శ్రీనివాసరావు, పోలీస్ కానిస్టేబుల్ ఎస్.బాలాజీ, ఎం.శ్రీనివాసుల కృషి అభినందనీయమన్నారు. ఈ పోలీసు బృందాన్ని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ అభినందించారు. నగదు రివార్డును త్వరలో అందించనున్నట్లు చెప్పారు.


వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి ప్రసాద్

ఒంటరితనాన్ని భరించలేక...

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఒంటరి జీవితాన్ని భరించలేక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఘటన మండలంలోని కె.జగ్గవరంలో గురువారం చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ కె.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కె.జగ్గవరం గ్రామానికి చెందిన బర్రె రాజేష్ (35) పదేళ్ల క్రితం తన పెద్ద అక్క కుమార్తెను వివాహం చేసుకున్నాడు. అయితే పెళ్లైన నెల రోజులకే ఆమె వెళ్లిపోయింది. ఈ క్రమంలో రాజేష్ తల్లి వద్ద ఉంటున్నాడు. అతనికి చిన్నప్పటి నుంచి కొంచెం మతిస్థిమితం సరిగా లేకపోవడం వల్ల అప్పుడప్పుడు ఫిట్స్ వచ్చేది. ఈ నేపథ్యంలో ఒంటరి జీవితాన్ని భరించలేక ఈ నెల 13వ తేదీన గుర్తు తెలీని మందు తాగి ఇంటివద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో స్థానికులు అతనిని చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. మృతుని సోదరుడు ఏలియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సి తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

జాతీయ రహదారిపై ఖాళీ బిందెలతో మండవల్లి వాసుల ధర్నా

రోడ్డుకు ఇరువైపులా నిలిచిన వాహనాలు

పోలీసుల హామీతో ఆందోళన విరమణ

ప్రజాశక్తి - మండవల్లి

తాగునీరు సరఫరా కాకపోవడంతో గొంతు ఎండిన మండవల్లి వాసులు ఆగ్రహావేశాలకు గురై జాతీయ రహదారిపై ఖాళీ బిందెలతో బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ మండవల్లిలో కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా కావడం లేదన్నారు. స్టేషన్ రోడ్డులో కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. 25 రోజుల నుంచి స్టేషన్ రోడ్డుకు తాగునీరు సరఫరా కావడంలేదని, సర్పంచి, సెక్రటరీ దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 25 రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోతే సర్పంచిగా, సెక్రటరీగా ఏం చేస్తున్నారంటూ నిలదీశారు. సమాధానం చెప్పే వరకు ధర్నా విరమించేది లేదంటూ రోడ్డుపై బైఠాయించారు. వీరికి ఒకటి, రెండు, ఐదు వార్డు మెంబర్లు సత్యనారాయణ, పెద్దింటి ఇందిరా, అడపా జానీలు సంఘీభావం తెలిపి ధర్నాలో పాల్గొన్నారు. జాతీయ రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చర్యలు చేపడతామని, రోడ్డుపై ధర్నా నిలుపుదల చేయాలని కోరారు. తాగునీటి కోసం ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని, ఏ అధికారి మా అవస్థలను పట్టించుకోలేదని, అధికారులను ఇక్కడికి రప్పించి సమాధానం చెప్పించాలని పోలీసులను వేడుకున్నారు. ఆందోళన చెందవద్దని అధికారులతో మాట్లాడి కుళాయిల ద్వారా నీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామని పోలీసులు గ్రామస్తులకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.


రోడ్డుపై ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న గ్రామస్తులు

కంట్రోల్ రూములు ఏర్పాటు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

భారీ వర్షాల దృష్ట్యా నగరంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ భానుప్రతాప్ తెలిపారు. పౌరులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొకుండా 24 గంటలు సకాలంలో స్పందించేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. ఎవరికి ఎటువంటి ఇబ్బంది ఉన్నా టోల్ ఫ్రీ నెంబర్లు 08812-222200, 08812-232101 సంప్రదించాలని తెలిపారు. రాత్రి పది గంటల నుంచి ఉదయం ఆరు గంటల వరకు కమాండ్ కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహించేందుకు సిబ్బందిని నియమించారు.

భీమడోలు : తుఫాన్, వర్షాల నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు భీమడోలు మండల పరిధిలోని గ్రామ సచివాలయాల వారీగా కంట్రోల్ రూములను ఏర్పాటు చేసినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి బివిఎస్‌వి.శర్మ (పూర్తి అదనపు బాధ్యతలు) తెలిపారు. వర్షాల కారణంగా తాగునీటి ఇబ్బందులు, పారిశుధ్య లోపాలు, లోతట్టు ప్రాంతాలు జలమయం కావటం, ఇతర ఇబ్బందులు ఏర్పడితే గ్రామ ప్రజలు తమ పరిధిలోని గ్రామ సచివాలయానికి ఫోన్ ద్వారా తెలియజేయాలని ఆయన కోరారు. ఈ నేపథ్యంలో విధులు నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది ఫిర్యాదుదారుని చిరునామా, సమస్య, వారి సెల్ నెంబర్‌ను నమోదు చేసుకుంటారని తెలిపారు. సదరు ఫిర్యాదు వివరాలు సచివాలయ సిబ్బంది తుఫాన్ నేపథ్యంలో భీమడోలు మండల పర్యవేక్షణ అధికారిగా పనిచేస్తున్న సహాయ మండల పరిషత్ అభివృద్ధి అధికారి దృష్టికి తెస్తారన్నారు. వారి సలహాలు, సూచనల మేరకు సమస్యను పరిష్కరించి పనుల ప్రగతి వివరాలను ఫిర్యాదుదారులకు తెలియజేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ సచివాలయాల్లో 24 గంటలు సేవలు అందుబాటులో ఉండేందుకు మూడు షిఫ్టుల వారీగా సిబ్బందిని నియామకం చేశామన్నారు. వారి ఫోన్ వివరాలు అందరికీ తెలిసే విధంగా అందుబాటులో ఉంచామని తెలిపారు.

సంప్రదాయం పేరిట జూదం తగదు

డిఎస్‌పి కెవివిఎన్‌వి.ప్రసాద్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

సంప్రదాయం పేరుతో జూదం ఆడటం తగదని నూజివీడు డిఎస్‌పి కెవివిఎన్‌వి.ప్రసాద్ అన్నారు. పట్టణంలోని రూరల్ సర్కిల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఇటీవల టిడిపి సీనియర్ నేత కాపా శ్రీనివాసరావు పోలీసులపై చేసిన వ్యాఖ్యల గురించి పాత్రికేయులు డిఎస్‌పిని ప్రశ్నించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయం అనే పేరిట జూద క్రీడలకు తావు ఇవ్వకూడదన్నారు. కొన్ని ప్రాంతాల్లో 50 గ్రామాల నుంచి వచ్చి జూదం ఆడుతుంటే పోలీసులు ఎందుకు పట్టించుకోలేదని కాపా ఘాటుగా వ్యాఖ్యానించిన విషయాన్ని ప్రస్తావించగా డిఎస్‌పి స్పందిస్తూ తమకు వృత్తి నిర్వహణలో ఏ ఒక్కరూ బంధువు కాదని, శత్రువులు కాదని చెప్పారు. తమకు సమాచారం అందిస్తే తక్షణమే చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. మొత్తంగా సీనియర్ నేత కాపా వ్యాఖ్యలు తమను బాధించాయన్నారు.

రాష్ట్ర పోలీసు సేవా పతకానికి హెచ్‌సి సత్యనారాయణ ఎంపిక

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

దెందులూరు హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఎన్‌విఆర్.సత్యనారాయణ రాష్ట్ర పోలీసు సేవా పతకానికి ఎంపియ్యారు. రాష్ట్ర ఆయన 1993 బ్యాచ్‌లో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. అనంతరం హెడ్‌కానిస్టేబుల్‌గా ఉద్యోగోన్నతి పొందారు. రాష్ట్ర పోలీసు సేవా పతకానికి ఎంపికైన సత్యనారాయణను దెందులూరు ఎస్‌ఐ ఆర్.శివాజీ, స్టేషన్ సిబ్బంది అభినందించారు.

అడవినెక్కలంలో తెలంగాణా సెర్ప్ బృందం పర్యటన

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఎపి సెర్ప్ ఆధ్వర్యంలో అడ్వాన్స్ క్రెడిట్ ప్లాన్ (ముందస్తు రుణ ప్రణాళిక) కార్యక్రమం ఎంతో ఆదర్శనీయంగా ఉందని తెలంగాణా రాష్ట్ర సెర్ప్ బ్యాంక్ లింకేజ్ డైరెక్టర్ వైఎస్.రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అడవినెక్కలంలో ఎపిఎం దయాల రాజశేఖర్ అధ్యక్షతన జరుగుతున్న శాంతి గ్రామైక్య సంఘ తెలంగాణ సెర్ప్ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు ఎపిలో ఎసిపిఎల్ ఎన్‌సిపి, హెచ్‌ఎల్‌పిల అమలు, సంఘ సభ్యులు ఇన్‌వాల్‌మెంట్ ఏ విధంగా ఉందనే అంశాలను పరిశీలించారు. అనంతరం స్థానిక యూనియన్ బ్యాంకును సందర్శించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణా సెర్ప్ ప్రాజెక్ట్ మేనేజర్ బాలస్వామి, ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ కిరణ్, ఎపి సెర్ప్ టీమ్ సభ్యులు బ్యాంక్ లింకేజీ అడిషనల్ డైరెక్టర్ వై.రమాదేవి, ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ మూర్తి, జిల్లా ఎపిడి అనిత, డిపిఎం ఐబి విజయకుమారి, సిసి దివ్య, ఎంఎస్ అధ్యక్షురాలు శాంత కుమారి, విఒ ప్రెసిడెంట్ ధనలక్ష్మి, యూనియన్ బ్యాంక్ మేనేజర్ భార్గవి, ఫీల్డ్ ఆఫీసర్ అరవింద్ పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపీ

ప్రజాశక్తి - ముసునూరు


ప్రత్యేక అవసరాల పిల్లలు ప్రతిరోజూ ఉదయం వ్యాయామం చేస్తే మానసిక ఆరోగ్యంతో పాటు శారీరక ఆరోగ్యం కలిగి ఉంటారని ఫిజియోథెరపిస్టు జి.ప్రశాంతి తెలిపారు. మండలంలోని రమణక్కపేట మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో గురువారం ఫిజియోథెరపీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల పిల్లలు ప్రతిరోజూ ఉదయం పూట వ్యాయామం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎం వి.లక్ష్మీనారాయణరావు, జి.నాగమల్లేశ్వరి, ప్రధానోపాధ్యాయులు పి.భాస్కరరావు పాల్గొన్నారు.

సొసైటీలను అభివృద్ధి పథంలో నడిపించాలి

చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

నియోజకవర్గంలో సహకార సంఘాలన్నింటిని అభివృద్ధి పథంలో నడిపించాలని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ కోరారు. లింగపాలెం మండలం కె.గోకవరం సొసైటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ రైతుల అభ్యున్నతికి సహకార సంఘాలు దోహదపడాలన్నారు. రైతు సోదరులు సహకార సంఘాల సేవలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని కోరారు. సొసైటీని లాభాల బాటలో నడిపించేందుకు నూతన కార్యవర్గం ఉత్సాహంగా పని చేయాలన్నారు. నియోజకవర్గంలో ఆదర్శవంతంగా ఉండే విధంగా ఈ కార్యవర్గం కృషి చేయాలని చెప్పారు. అనంతరం పలువురు వైసిపి నాయకులు టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్

సొసైటీ ఛైర్మన్‌గా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ


ఎంఎల్‌ఎ వెంకటరాజును సత్కరిస్తున్న సొసైటీ ఛైర్మన్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర విశాల సహకార సంఘం ఛైర్మన్‌గా పోలిన శ్రీనివాసరావు గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. డైరెక్టర్లు లక్కాబత్తుల మహేశ్వరి, చిలుకూరి సూర్యవతి ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా గోపాలపురం ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు, ఎఎంసి ఛైర్మన్ యద్దనపూడి బ్రహ్మారాజు హాజరయ్యారు. టిడిపి మండలాధ్యక్షులు లంకా సత్యనారాయణ, దేవరపల్లి మండలాధ్యక్షులు ఆండ్రు అనిల్, ఎఎంసి వైస్ ఛైర్మన్ పోతన ధర్మరాజు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు దేవరపల్లి వీరాస్వామి చౌదరి, గోపాలపురం నియోజకవర్గ నాయకులు పసుమర్తి రతీష్, మాజీ ఎంపిపి ఏపూరి దాలయ్య, జెడ్‌పిటిసి సభ్యులు చిగురుపల్లి శ్యామ్యులు, నల్లజర్ల మాజీ ఎంపిపి కమ్ముల, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మట్టపర్తి రూపేష్ కుమార్, మండల ఉపాధ్యక్షులు గురజాల చంద్రరావు, దేవరపల్లి సొసైటీ ఛైర్మన్, ఉప్పులూరి రాము, రామన్నగూడెం సొసైటీ ఛైర్మన్ బొబ్బా రాము, గుండుగోలనుకుంట సొసైటీ ఛైర్మన్ అద్దంకి శేఖర్, ద్వారకాతిరుమల సర్పంచి కుంటం స్వర్ణలత, సీనియర్ నాయకులు ఇమ్మడి రత్నాజీ, నాదెళ్ల సురేంద్ర, మాజీ సొసైటీ ఛైర్మన్ గంటా శ్రీనివాసరావు, మొగతడకల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కృష్ణారావుపేట సొసైటీ అధ్యక్షులుగా ప్రసాద్

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని కృష్ణారావుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన అధ్యక్షులుగా కొణతాల ప్రసాద్, సభ్యులుగా ఎదిరేసి వెంకట్రావు, మిరియాల చంటి గురువారం నియమితులయ్యారు. కొణతాల ప్రసాద్ గతంలో సొసైటీ అధ్యక్షులుగా సుదీర్ఘ కాలం పనిచేశారు. సొసైటీ అధ్యక్షులుగా నియమితులైన ప్రసాద్‌ను జనసేన నాయకులు గునపర్తి చిన్ని, మాజీ సర్పంచి అల్లు జగన్, జల్లేపల్లి వెంకటనరసింహారావు, కొల్లు శ్రీను, అనిశెట్టి రాధయ్య, సిద్దన రామకృష్ణ, సిబ్బంది నారాయణరావు, జనసేన పార్టీ ఐటీ వింగ్ కో-ఆర్డినేటర్ ఆటపాకల వెంకటేశ్వరరావు పాల్గొని అభినందనలు తెలిపారు.


పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలుపుతున్న జనసేన నాయకులు

వీర జవాను తేర దేవ సుందరం

మానూరు పాఠశాలలో వర్ధంతి కార్యక్రమం


వర్ధంతి కార్యక్రమంలో ప్రముఖులు, విద్యార్థులు


ప్రజాశక్తి - దెందులూరు

దేశ సేవ కోసం రెండో ప్రపంచ యుద్ధంలో (1939-45) వీరమరణం పొందిన వీర జవాను తేర దేవ సుందరం వర్ధంతి వేడుకలు గురువారం మానూరు పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు తేర ప్రసాద్ మాట్లాడుతూ దేశ సేవ కోసం వీరమరణం పొందిన వీర జవాన్ ఏలూరు రూరల్ మండలం మానూరు గ్రామ నివాసి తేర దేవసుందరం కావడం గర్వకారణమన్నారు. సుందరం మనవడు మానూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తుండటం ఆనందంగా ఉందన్నారు. వీర జవాన్ కుమారుడు తేర ఆమోస్ కూడా ఇక్కడే ఉపాధ్యాయులుగా పనిచేశారని చెప్పారు. ఆయన వర్ధంతి సందర్భంగా తేర కుటుంబ సభ్యులు మానూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థుల అభివృద్ధికి రూ.మూడు వేల ఆర్థిక సాయం అందించారు. ప్రధానోపాధ్యాయులు తేర ప్రసాద్ పాఠశాలకు జాతీయ నాయకుల సిమెంట్ ప్రతిమలు, రిటైర్డ్ టీచర్ తేర దేవ సుందరం లైబ్రరీ బుక్స్ కోసం రూ.వెయ్యి ఆర్థిక సాయం అందించారు. పాఠశాల ఉపాధ్యాయిని తాలాడ అరుణ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ పేరం రాములు, వైస్ ఛైర్మన్ కడియం మణిపీటర్, తల్లిదండ్రులు తేర దేవ సుందరం (రిటైర్డ్ సోల్జర్) వారికి గొటికల యేసుపాదం (రిటైర్డ్ సోల్జర్) నివాళులర్పించారు.

16న బుట్టాయగూడెంలో జాన్ బ్రిట్టాస్ పర్యటన

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఈ నెల 16వ తేదీన బుట్టాయగూడెం మండలంలో రాజ్యసభలో సిపిఎం ఫ్లోర్ లీడర్ జాన్ బ్రిట్టాస్ పర్యటించనున్నారని సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ తెలిపారు. సిపిఎం బుట్టాయగూడెం మండల కమిటీ సమావేశం తామ ముత్యాలమ్మ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ జాన్ బ్రిట్టాస్ నిర్వాసిత కాలనీలను పరిశీలించనున్నారని తెలిపారు. గిరిజనులు సాగు చేస్తున్న ఎల్‌టిఆర్, 1/70 చట్ట భూములను, వివాదాల్లో ఉన్న, ఆర్‌అండ్‌ఆర్ కొనుగోలు చేసే భూములను పరిశీలిస్తారని చెప్పారు. ఈ పర్యటనలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం, బి.తులసీదాసు, జిల్లా నాయకులు ఉంటారని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం మండల నాయకులు పోలోజు నాగేశ్వరరావు, ఉడతా వెంకటేశ్వరరావు, కురసం భీమరాజు, మడకం శ్రీదేవి, వెట్టి వీరయ్య, గంగరాజు, మడకం వీరాయమ్మ, తెల్లం వెంకటలక్ష్మి, కారం ముత్యాలరావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నేతలు

శ్రీమాధురి కళాశాలలో విద్యార్థి సంఘ ఎన్నికలు

ప్రజాశక్తి - భీమడోలు

మాంటిస్సోరి విద్యాసంస్థల ఆధ్వర్యంలో భీమడోలు కేంద్రంగా కరస్పాండెంట్ కె.ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీమాధురి జూనియర్ కళాశాల విద్యార్థి సంఘ ఎన్నికలు గురువారం నిర్వహించారు. ఇదే క్రమంలో విద్యార్థులకు సాధారణ పాలన, ఎన్నికల నిర్వహణ, ఎన్నికల ప్రాముఖ్యత గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కరస్పాండెంట్ కె.ప్రేమ్‌కుమార్ తెలిపారు. అనంతరం ఇదే తరహాలో ఎన్నికలను నిర్వహించామన్నారు. జూనియర్ కళాశాల విద్యార్థి సంఘ నాయకులుగా సీనియర్ ఇంటర్‌కు చెందిన రాజేష్ ఎన్నికయ్యారని తెలిపారు. ఇదే క్రమంలో సీనియర్ ఇంటర్, జూనియర్ ఇంటర్ తరగతులకు చెందిన విద్యార్థులకు వేర్వేరుగా సిపిఎల్, డిసిపిఎల్ ఎన్నికలు నిర్వహించామన్నారు. సీనియర్ ఇంటర్ నుంచి బాలుర తరపున సిపిఎల్‌గా ముగ్గురు పోటీకి దిగగా వీరి నుంచి రాజేష్, బాలికల తరపున ఆరుగురు పోటీకి దిగగా వీరిలో డి.జెస్సికా, జూనియర్ ఇంటర్ నుంచి బాలుర తరపున డిసిపిఎల్‌గా నలుగురు పోటీకి దిగగా వీరిలో టి.అఖిల్, బాలికల తరుపున ఐదుగురు పోటీకి దిగగా వీరిలో కీర్తి ఎన్నికయ్యారన్నారు. వీరందరి నుంచి కళాశాల విద్యార్థి సంఘ నాయకులుగా రాజేష్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కరస్పాండెంట్ తెలిపారు. ఎన్నికలను కళాశాల ప్రధాన ఆచార్యులు అశోక్ కేసరితో పాటు ఇన్‌ఛార్జి బాలు ఆధ్వర్యంలో కళాశాలకు చెందిన ఇతర అధ్యాపకులు, సిబ్బంది సహకారంతో ఎన్నికల నిర్వహించినట్లు కరస్పాండెంట్ తెలిపారు.

'రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు తగవు'

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

దేశ భద్రత కోసం, రాజ్యాంగ పరిరక్షణ కోసం ఎలక్షన్ కమిషన్ నిర్ణయాలపై పోరాటం చేస్తున్న రాహుల్ గాంధీని దేశ ప్రజలందరూ మెచ్చుకుంటుంటే జగన్ ఓర్వలేక రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని కాంగ్రెస్ యూత్ ప్రధాన కార్యదర్శి గోళ్ళ పవన్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత 12 ఏళ్లుగా బిజెపి దుర్మార్గాలు చేస్తున్నా, వ్యవసాయ నల్ల చట్టాల అమలు చేసినా, ఎన్‌ఆర్‌సి చట్టం ప్రవేశపెట్టినా, రాష్ట్రానికి ఏ విధమైన మేలు చేయకపోయినా జగన్ మాట్లాడకుండా బిజెపికి అద్దె మైకు లాగా తయారయ్యారని తెలిపారు.

ఆయిల్‌పామ్ మొక్కల పంపిణీ

ప్రజాశక్తి ఉంగుటూరు

మండలంలోని యర్రమిల్లిపాడులో ఉద్యానశాఖ సహకారంతో గోద్రేజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ డ్రైవ్ కార్యక్రమంలో ఉంగుటూరు ఎంఎల్‌ఎ, పత్సమట్ల ధర్మరాజు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్కువ ఆదాయం వచ్చే సంప్రదాయ వ్యవసాయ పంటల నుంచి అధిక ఆదాయం వచ్చే వాణిజ్య పంటలైన ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టి పెట్టాలని, విస్తరణపై అధిక ప్రాధాన్యత, ప్రోత్సాహకాలు ప్రభుత్వం అందిస్తుందని ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు పేర్కొన్నారు. గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగుపై ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహంతో గోద్రేజ్ ఆగ్రోవెట్ వారి ఆధ్వర్యంలో పామాయిల్ సాగు వల్ల లాభాలపై రైతులకు అవగాహన కల్పించి, కొత్తగా తోటలు వేసే రైతులకు ఉచితంగా పామాయిల్ మొక్కలను అందించి ప్రదర్శన స్టాల్‌ను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉత్తమ ఆయిల్ పామ్ రైతులను సత్కరించారు. జిల్లా ఉద్యాన అధికారి రామ్మోహన్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు ప్రాముఖ్యత, అంతర పంటలు వేసుకోవడం వల్ల అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు.

నేడు పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలో శుక్రవారం ఏలూరు ఎంపీ పుట్టా మహేష్, చింతలపూడి ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు, ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని బొర్రంపాలెంలోని ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉదయం పది గంటలకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరణలో పాల్గొంటారని, అనంతరం మండలంలోని వీరభద్రవరం, వెలగపాడు గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం మండలంలోని తిరుమల దేవిపేట, టి.నర్సాపురం, కేతవరం, గుడ్లపల్లి గ్రామాల్లో జరిగే వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు.

ఎస్‌బిఐ అసిస్టెంట్ మేనేజర్ తీరు సరికాదు

వైసిపి మండలాధ్యక్షులు మురళీకృష్ణ

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకులో ఖాతాదారుల పట్ల బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ వ్యవహార తీరు సక్రమంగా లేదని వైసిపి మండలాధ్యక్షులు బుగ్గా మురళీకృష్ణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏజెన్సీలో ఉన్న ఎస్‌బిఐ బ్యాంకుకు నిరక్ష్యరాశులు, వృద్ధులు అధికంగా వస్తారని, వీరికి బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ సరైన సహాయ సహకారాలు అందించకుండా చిరాకు పడడం, అన్ని సేవలు బ్యాంకు సిబ్బంది అందించరని, మీకున్న సెల్‌ఫోన్ ద్వారా పొందాలని చెబుతున్నట్లుగా తన దృష్టికి వచ్చిందని తెలిపారు. పోలవరంలో గిరిజనులు, దళితులతో పాటు పేదలు ఎక్కువగా ఉన్నారని, వీరికి కంప్యూటర్ పరిజ్ఞానం, సెల్‌ఫోన్ ఉపయోగించడం రావని, వీరి గోడు బ్యాంకు అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. అసిస్టెంట్ మేనేజర్ ఖాతాదారులకు సరిగా సమాధానం కూడా చెప్పడంలేదని, బ్యాంకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. బ్యాంకులో సేవలపై ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని తెలిపారు.

'కాకినాడకు మల్లాడి సత్యలింగ నాయకర్ పేరు పెట్టాలి'

ప్రజాశక్తి - కలిదిండి

కాకినాడ జిల్లాకు విద్యాదాత మల్లాడి సత్యలింగ నాయకర్ పేరు పెట్టాలని రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు అన్నారు. నాయకర్ అనేక విద్యాసంస్థలను నెలకొల్పడమే కాక ఆదాయ వనరులను సమకూర్చి, లక్షలాది మంది విద్యావేత్తలను తయారు చేసిన మహోన్నత వ్యక్తి అన్నారు. ఆయన పేరు పెట్టాలని అనేక ఏళ్లగా వివిధ రూపాల్లో ప్రభుత్వాలను కోరుతున్నట్లు చెప్పారు. దక్షణ కాశీగా పేరొందిన అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని అగ్నికుల క్షత్రియ వంశానికి చెందిన కొప్పనాతి కృష్ణమ్మ నిర్మించి, ఆలయ అభివృద్ధికి వందలాది ఎకరాలు దానం చేసిందన్నారు. ప్రభుత్వం ఓ కమిటీ ఏర్పాటు ద్వారా నిర్మాణం, భూదానం వంటివి పరిగణలోకి తీసుకుని ఆమె వారసులను దేవాలయ ట్రస్ట్ ఛైర్మన్‌గా నియమించాలన్నారు. ఈ విషయాలపై సిఎం చంద్రబాబును, మంత్రి లోకేష్‌ను కలిసి వినతిపత్రం అందించి వివరించినట్లు తెలిపారు.

ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక
45వ వార్షికోత్సవ ప్రత్యేక అనుబంధం
ఏలూరు జిల్లా
ఆగస్టు 2025
8 పేజీలు
Advt.feature 2

అప్రతిహత పురోగమనం..
ప్రజాశక్తి సొంతం



ప్రజాశక్తి దినపత్రిక దాదాపు నాలుగున్నర దశాబ్దాలు పూర్తి చేసుకుని 45వ వార్షికోత్సవ ఘట్టంలోకి ప్రవేశించింది. అక్షరాక్షర దీక్షగా.. ఆశయాలే రక్షగా.. నడచొచ్చిన దారులు, గడిచిపోయిన రోజులు.. ఈ సందర్భంలో కళ్ల ముందు కదలాడతాయి. దానితో సన్నిహిత సంబంధం, భాగస్వామ్యం ఉన్న వారికి పత్రిక చరిత్ర, పెరుగుదల కళ్ల ముందు సాక్షాత్కరిస్తాయి.

తెలుగులో పత్రికలు ప్రధానంగా సంఘ సంస్కరణలు, స్వాతంత్ర పోరాటం, వామపక్ష ఉద్యమాలు అనే మూడు నేపథ్యాల్లో తొలి అడుగులు వేశాయి. 1942లో ప్రజాశక్తి వారపత్రికగా ప్రారంభమైంది. ఆ విధంగా చూస్తే ఇది 83వ వార్షికోత్సవం కూడా. ఫాసిస్టు యుద్ధాన్ని ఖండించడంలోను, ప్రగతిశీల భావాలను వ్యాపింప జేయడంలోనూ నాటి ప్రజాశక్తి కీలక పాత్ర వహించింది. 1945లో దినపత్రికగా మారింది. సుందరయ్య, కంభంపాటి, మద్దుకూరి వంటి వారి కృషి ఇందులో ఉంది. శ్రీశ్రీ, కొడవటిగంటి కుటుంబరావు, ఉప్పల లక్ష్మణరావు వంటి సుప్రసిద్ధుల రచనలు దానిలో వచ్చేవి. గ్రాంథికం, వ్యవహారం, వాదోపవాదాల మధ్య పత్రికా భాష ఇంకా పూర్తిగా స్థిరపడని ఆ కాలంలో జన సామాన్యానికి అర్థమయ్యే విధంగా రాయడంలో ప్రజాశక్తి భాషకు ఒరవడి, భావాలకు వరిపిడి అయింది. ఇది నచ్చని ఛాందసులు 'పెద్ద బాలశిక్ష ఫెయిల్–ప్రజాశక్తి పాస్' అని అపహాస్యం చేశారు కూడా! 1946లో ప్రారంభమైన సాయుధ తెలంగాణ రైతాంగ పోరాటానికి ప్రజాశక్తి వాణిగా పనిచేసింది. ప్రభుత్వం 1948లో విజయవాడలోని ప్రజాశక్తి నగర్‌పై దాడి చేసి, విధ్వంసానికి పాల్పడింది. నిజాం నవాబు క2ూడా హైదరాబాద్ సంస్థానంలో నిషేధించాడు. నూతన స్వాతంత్రం, రాష్ట్రాల ఏర్పాటు, ఎన్నికలు తదితర పరిణామాల మధ్య మళ్లీ 1951లో వారపత్రికగా పున:ప్రారంభమైంది. కొన్నాళ్ల తర్వాత దినపత్రికగా మారి విశాలాంధ్ర పేరుతో పున:ప్రారంభమైంది. మద్దుకూరి చంద్రం, మోటూరు హనుమంతరావు తదితరులు దాని సంపాదకులుగా ప్రసిద్ధులు. ప్రజాశక్తి 1968లో వారపత్రికగా, 1981 ఆగస్టు ఒకటో ..2లో

అప్రతిహత పురోగమనం.. ప్రజాశక్తి సొంతం

(మొదటి పేజీ నుంచి)

తేదీన దినపత్రికగా అవతరించింది. మోటూరు హనుమంతరావు అధ్యక్షతన పుచ్చలపల్లి సుందరయ్య సమక్షంలో నాటి సిపిఎం ప్రధాన కార్యదర్శి ఇఎంఎస్.నంబూద్రిపాద్ దాన్ని ఆవిష్కరించడం ఇంకా కళ్ల ముందు కదలాడుతున్నట్లుంది. చాలామంది ఈ పత్రిక నడవటం కష్టమని అనేవారు. వారి సందేహాలను పటాపంచలు చేస్తూ అక్షరాయుధంగా పదునెక్కుతూ ప్రజాశక్తి ప్రస్థానం నడిచింది. అంకిత భావం గల నాయకత్వం సంపాదకులు, కార్మికులు, ఉద్యోగ సిబ్బంది సేవలు, ఉద్యమాభిమానులు, పత్రిక శ్రేయోభిలాషుల అండదండలు దాన్ని నిలబెట్టాయి.

ఒక దశలో నాలుగు పేజీలకే పరిమితమైన ప్రజాశక్తి ప్రజల సహకారంతోనే మళ్లీ పురోగమన మార్గం చేపట్టింది. క్రమేణా విస్తరించి 1994లో హైదరాబాదులో రెండో ఎడిషన్ ప్రారంభించింది. అప్పట్లో అదీ నడవదని, అవాస్తవికమని చాలా మంది జోస్యాలు, జాగ్రత్తలు చెప్పారు. అయితే ఇప్పుడు ప్రజాశక్తి ఎనిమిది ఎడిషన్లతో విస్తృతమైన యంత్రాంగంతో, రంగుల యంత్రాలతో ముందుకుపోవడం ఫలప్రదమైన ప్రయోగం. సమస్యలు లేవని కాదు, వనరుల కొరత లేదనీ కాదు. తీవ్రమైన కరోనా తాకిడితో సహా చాలా సంక్లిష్ట సమస్యలే ఎదురయ్యాయి. అంకితభావం గల సిబ్బంది రాజకీయ నైశిత్యం, ఉద్యమాల ఆలంబన, శ్రేయోభిలాషుల అండదండలు ఉంటే సంక్లిష్టమైన సవాళ్లను అధిగమించడం సాధ్యమేనని పత్రిక పురోగమనం నిరూపిస్తోంది.

మార్పులకు అన్వయించుకుంటూ..

సామాజిక మార్పులను, సాంకేతిక ప్రగతిని పరిగణనలోకి తీసుకుని ముందుకు పోవడంలోనే ఈ పురోగమన రహస్యం ఉంది. రష్యన్ సోషలిజం ప్లస్ అమెరికన్ మేనేజ్‌మెంటు అని స్టాలిన్ అన్న మాటలు సుప్రసిద్ధం. సంస్కరణలు వాటికవే చెడ్డవి కావు. చెడ్డ సంస్కరణలే ప్రమాదకరమైనవి. సామాజిక మార్పులను, సాంకేతిక ప్రగతిని పరిగణనలోకి తీసుకుని ముందుకు పోవడంలోనే ఈ పురోగమన రహస్యం ఉంది. ప్రజాశక్తి ఆ సూత్రాన్ని అన్వయించుకోవడం వల్లే ప్రగతిశీలవాదులకు వేదిక కాగలిగింది. తమ మౌలిక అభిప్రాయాలకు కట్టుబడి ఉంటూనే లోగోతో సహా అనేక మార్పులు చేసుకుంది.

ఈ నలభయ్యేళ్లలో మీడియా ముఖచిత్రం ఎంతగానో మారింది. ఆధిపత్య శక్తులకు అంగీకార సృష్టి నేటి ప్రపంచాధిపత్య వ్యూహంలో ప్రధానాంశం. ఇందులో పెద్ద పాత్ర మీడియాది. అందుకే ప్రజానుకూల శక్తులు ప్రత్యామ్నాయ మీడియా కోసం గట్టి కృషి చేస్తున్నాయి. అమెరికా వంటి చోట్ల కూడా ప్రత్యామ్నాయ భావజాల కృషి ఉధృతమవుతోంది. తెలుగు మీడియా ముఖ్యుల్లో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రగతిశీల భావాల ప్రేరణ లేనివారు చాలా తక్కువ. అయితే ఇప్పుడు భారతీయ మీడియాలో ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ, సోషల్ మీడియాలోనూ కార్పొరేట్ శాసనం ప్రబలిపోయింది. ఆంక్షల అంకుశాలు, నిరంకుశ పాలకుల శాసనాలు మీడియాను వెంటాడుతుంటే ఆ విలువలు వెలవెలబోతున్నాయి. మరీ ముఖ్యంగా తెలుగునాట ప్రధాన పత్రికలు, ఛానళ్లు రెండు ప్రాంతీయ పాలక పార్టీల మధ్య విభజింపబడి వివాదాల్లో మునిగి తేలుతున్నాయి. దేశం నెత్తిన కూర్చున్న మోడీ అప్రజాస్వామిక పోకడలను బహిర్గతం చేయడం వీటి ఎజెండాలోనే ఉండదు. అంతర్జాతీయంగా అమెరికా ఆధిపత్యాన్ని ప్రతిఘటించడమూ ఉండదు. పెగాసస్, కాశ్మీర్, రైతాంగ ఆందోళన, యూరప్‌లో మితవాద విజృంభణ ఏదైనా సరే వీటికి అవసరం లేని పని. స్థానిక పాలక పార్టీల ప్రయోజనాలకూ, ఢిల్లీ పెద్దల దృక్పథానికి విరుద్ధమైన విశ్లేషణలూ, పరిశీలనలూ వీటిలో అసలు కనిపించవు. ఈ సోషల్ మీడియా యుగంలో ఇందుకు సంబంధించిన విస్తారమైన సమాచారం ప్రజాస్వామిక మేధావులు, పాత్రికేయులు, రచయితలు తవ్వితీస్తున్నా వీరికి అక్కర్లేదు. ఈ రాష్ట్రంలో తాము బలపర్చే పక్షాన్ని తలకెత్తుకోవడం, అవతలి పక్షంపై దాడి చేయడం, అవసరమైతే అందుకు అవాస్తవాలూ అతిశయోక్తులైనా ప్రధానంగా ప్రచారంలో పెట్టడం నిత్యకృత్యమైంది. ఒకరు అధికారంలో వుంటే మరోవైపు మీడియాపై దాడి చేయడం పరిపాటిగా మారింది. ఇతర వాణిజ్య పోకడలు, సంచలనాలు, సెలబ్రిటీ ముచ్చట్లు సరేసరి. ప్రజాశక్తి వీటికి అతీతంగా ప్రజల ప్రయోజనాలే పరమావధిగా 'ప్రతి అక్షరం ప్రజల పక్షం' అంటూ ప్రస్థానం సాగిస్తోంది.

జాతీయ పతాక నిర్మాత పింగళి



జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య ఆగస్టు 2, 1878న దివి తాలూకా భట్లపెనుమర్రు గ్రామంలో జన్మిం చారు. ఆయన బాల్యం, విద్యాభ్యాసం ఇక్కడే కొనసాగింది. 12 సంవత్సరాలకే సెకండరీ విద్య పూర్తిచేసి 19 సంవత్సరాల ప్రాయంలోనే యుద్ధంలో చేరాలనే కోరికతో ముంబై వెళ్ళి సైన్యంలో చేరి ఆఫ్రికాకు వెళ్లారు. అక్కడ గాంధీజీని కలవటం, స్వాతంత్ర్యోద్యమం పట్ల ఆకర్షితుడు కావడంతో ఇండియాకు తిరిగి వచ్చారు. అప్పటికే మద్రాసులో ప్లేగు వ్యాధి ప్రబలి ఉండటంతో దేశ ప్రజలను ఆ వ్యాధి నుంచి కాపాడాలన్న తపనతో వ్యాధి నివారణ అధికారిగా పనిచేశారు. 1904లో రష్యాను జపాన్ గెలిచిందన్న వార్త విని వెంకయ్యలోని జిజ్ఞాస మేల్కొని ఇది ఎలా సంభవం, పెద్ద దేశాన్ని ఇంత చిన్నదేశం ఎలా జయించింది అనే తపనతో జపాన్ భాష నేర్చుకుని అనర్గళంగా మాట్లాడారు. జపాన్ వెంకయ్య అని పేరు పెట్టారు ప్రజలు. ఆయనకు ఆ భాష నేర్పిన గురువుకు మన భాషను నేర్పి గురు రుణం తీర్చుకున్నారట వెంకయ్య, వారి పట్టుదల ఎంత దృఢమైనదో యువత గుర్తుంచుకోవాలి. దేశభక్తిగల వెంకయ్య 1906లో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ మహాసభల్లో పాల్గొని నాటి సభాధ్యక్షులైన దాదాబాయి నౌరోజి మన్ననలు పొంది నిర్ణయ సభ సభ్యునిగా గుర్తింపు పొందారు. వ్యవసాయంపై ఆసక్తితో పరిశోధనలు చేసి వ్యవసాయ శాస్త్రం అనే గ్రంథాన్ని ప్రజలకు అందించారు. వారి మేథా సంపత్తి నుంచి మనం ఎంతైనా నేర్చుకోవాల్సివుంది. అందుకే ఆయనను రాజకీయ ద్రష్టగా అభివర్ణించారు పెద్దలు. 1906లో కోల్‌కొతాలో జరిగిన కాంగ్రెస్ సభల్లో ఇంగ్లీషు వారిని పొమ్మంటూనే వారి జెండాను ఉపయోగించటం నచ్చని వెంకయ్య మనకంటూ ఒక జెండా కావాలనే తపనతో భారతదేశ జాతీయ పతాకం అనే గ్రంథాన్ని 1916లో మనకు అందించారు. అప్పుడు వారిని జెండా వెంకయ్యగా పిలిచే వారు. ఇలా చెప్పుకుంటూ పోతే వారి జీవిత విశేషాలు ఎన్నో స్ఫూర్తిదాయకంగా ఉన్నాయి. 1921 మార్చి 31, ఏప్రిల్ 1వ తేదీన బెజవాడలోని గాంధీనగర్‌లో ఏర్పాటుచేసిన కాంగ్రెస్ మహాసభల్లో శాంతి సౌభాగ్యాలకు చిహ్నంగా మూడు రంగులతో గాంధీజీ సమక్షంలో వెంకయ్య రూపొందించిన జెండాను ఏకగ్రీవంగా కరతాళ ధ్వనుల మధ్య ఆమోదించబడి మొదట రాట్నం ఉన్న, తర్వాత పెద్దలు ధర్మానికి గుర్తుగా అశోకచక్రంతో మన జాతీయ జెండా కీర్తి అనే ఆకాశంలో విహరిస్తూ భారతదేశం మనది అనే స్ఫూర్తిని గర్వంగా చాటుతూ రెపరెపలాడుతోంది.










నారాయణపురం కాలేజీలో

నాణ్యమైన విద్యే లక్ష్యం

ఎంజిఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ శ్రీనివాస్


ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ శ్రీనివాసు

ప్రజాశక్తి - ఉంగుటూరు

కార్పొరేట్, ప్రయివేట్ కళాశాలకు దీటుగా నాణ్యమైన విద్యాబోధన చేస్తూ విద్యార్థులను ఉన్నత శిఖరాలకు తీసుకెళు తున్నారు ఉంగుటూరు మండలం నారాయణపురం మహాత్మా గాంధీ ప్రభుత్వ జూనియర్ కాలేజీ అధ్యాపకులు. ఏలూరు-తాడేపల్లిగూడెం జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఈ కళాశాలకు అనేక గ్రామాల నుంచి విద్యార్థులు వస్తున్నారు. 1969లో సర్వోదయ నాయకులు, కీర్తిశేషులు మాజీ మంత్రి చింతలపాటి వరప్రసాద మూర్తిరాజు కట్టించిన ఈ కాలేజీకి చదువులో, క్రమశిక్షణలో ఆది నుంచి మంచి గుర్తింపు ఉంది. అదే ఆ గుర్తింపును నేటికీ కొనసాగడం మరో ప్రత్యేకత.

అడ్మిషన్లు పెంచడంలో అధ్యాపకుల కృషి

ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయిర్‌లో చేరేందుకు పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను గుర్తించి ప్రభుత్వ కాలేజీలో చేరితే కలిగే ప్రయోజనాలను వారి తల్లిదండ్రులకు వివరించడం వల్లే ఈ విద్యా సంతవ్సరం అడ్మిషన్లు బాగా పెరిగాయి. ఇక్కడ ప్రతి అధ్యాపకుడూ విద్యార్థులను దత్తత తీసుకుని ప్రత్యేక శ్రద్ధ చూపడం మరో ప్రత్యేకత. విద్యార్థులు కళాశాలకు హాజరు కాకపోతే తల్లిదండ్రులతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా కృషి చేయడం వల్లే అనూహ్యంగా విద్యార్థుల సంఖ్య పెరిగిందనడంలో సందేహం లేదు.

మట్టిలో మాణిక్యాలను తయారు చేసిన అధ్యాపకులు

ఈ కాలేజీలో బాగా చదివి ఉన్నత విద్యావంతులైన, పేద ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి వారికి అవగాహన కల్పించడం వల్ల 2023-24లో కె.హేమలత 2024-25లో హనుమంతు అజయ్‌రాజు ప్రతిష్టాత్మకమైన విఐటిలో సిఎస్‌ఇలో ఉచిత సీటు సాధించారు. 2024-25లో జి.హాసిని ఫిషరీస్ యూనివర్సిటీ-నర్సాపూర్‌లో ఉచిత సీటు సాధించారు. ఇంటర్‌లో మంచి మార్కులు సాధించిన వారికి ప్రభుత్వం అందించే షైనింగ్ స్టార్ అవార్డు, రూ.20 వేల నగదుకు ఈ కాలేజీ విద్యార్థి ఎంపికవడం మరో విశేషం. విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దటంలో కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ బివి.శ్రీనివాసు, అధ్యాపకుల సమిష్టి ప్రత్యేక కృషిని అధికారులు అభినందిస్తున్నారు.

సామాజిక స్పృహ

చదువుతోపాటు సామాజిక స్పృహ కల్పిస్తున్నారు. రెడ్ రిబ్బన్ క్లబ్ పేరిట 20 మంది విద్యార్థులతో గ్రూపు ఏర్పాటు చేసి ఎయిడ్స్ తదితర ప్రాణాంతక వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారు. ఈగల్ క్లబ్ పేరిట యువత మత్తు మందుకు బానిక కాకుండా అవెర్‌నెస్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులందరికీ రాగి జావ, ఆహారం ప్రతి విద్యార్థికి అందేలా అధ్యాపకులు పర్యవేక్షణ చేయడం మరో విశేషం. గత మూడేళ్లుగా ఇంటర్ ఫలితాల్లో జిల్లా స్థాయి ర్యాంకులు నారాయణపురం విద్యార్థులకు చోటు దక్కడం ఇక్కడి అధ్యాపకుల కృషి, పట్టుదల, అంకితభావం కనిపిస్తోందని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పేద విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా చేయడమే లక్ష్యంగా బోధన


బివి.శ్రీనివాసు, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్, నారాయణపురం

ప్రభుత్వ కాలేజీలో చేరేవారంతా పేద విద్యార్థులే. అలాంటి వారిలో మట్టిలో మాణిక్యాలను వెలికి తీసేలా మా కళాశాల అధ్యాకులు ఉద్యోగంలా కాకుండా అంకిత భావం, సమాజ సేవే లక్ష్యంగా పనిచేయడం వల్లే ఎన్నో అవార్డులు, ఎచీవ్‌మెంట్స్ సాధించగలుగుతున్నాం. తల్లిదండ్రులతో తరచుగా సమావేశం పెట్టి విద్యార్థుల ప్రగతిని వివరిస్తున్నాం. అటు విద్యార్థి, ఇటు పేరెంట్స్‌కు ప్రభుత్వ కళాశాలపై మక్కువ, బాధ్యత ఉంటోంది. ఇంటర్ ఫలితాల్లో స్టేట్ సెకండ్ ర్యాంకు మా కాలేజీ విద్యార్థే కావడం ఎంతో సంతోషంగా ఉంది.

తెలుగు పత్రికల పుట్టిల్లు బెజవాడ

తెలుగు పత్రికా రంగానికి విజయవాడను పుట్టినిల్లుగా పేర్కొనవచ్చు. రాజమండ్రి, బందరు, హైదరాబాద్ వంటిచోట్ల కొన్ని ప్రముఖ పత్రికలు వెలువడినప్పటికీ పేరు ప్రఖ్యాతలు పొందిన అగ్రశేణి దినపత్రికలన్నీ ఇక్కడే ప్రచురణ ప్రారంభించాయి. జాతీయోద్యమంతో ప్రారంభించి ఆ తర్వాత కమ్యూనిస్టు సిద్ధాంత శంఖారావం మోగించిన అభ్యుదయ సీమపత్రికల, పుస్తకాల ప్రచురణకు కేంద్రమైన సాహిత్య కేంద్రం. నాటకరంగానికేగాక సినిమా పంపిణీ, జాతీయోద్యమంలో విజయవాడ (నాటి బెజవాడ) ఎప్పుడూ ముందున్నది. గాడిచర్ల హరిసర్వోత్తమరావు 1908లో 'స్వరాజ్య' పత్రికను ఇక్కడే స్థాపించారు. జాతీయోద్యమంపై బ్రిటిషు వారి దాడిలో తొలిగా తిలక్‌తోపాటు అరెస్టయిన వ్యక్తి గాడిచర్ల. ప్రజాశక్తి 1942లో మొదటగా ఇక్కడ నుండి ప్రచురణ ప్రారంభించింది. కాశీనాథుని నాగేశ్వరరావు బొంబాయిలో స్థాపించిన 'ఆంధ్ర పత్రిక' తర్వాత కాలంలో మద్రాసుకు మారింది. 'ఆంధ్రప్రభ' కూడా ఇక్కడ నుండే వెలువడేది. గోయెంకా 'ఆంధ్రప్రభ'కు నార్ల వెంకటేశ్వరరావు సంపా దకత్వంలో అనేక కొత్త ఒరవళ్లు పెట్టినా కమ్యూనిస్టు వ్యతిరేకతను నూరిపో సింది. 'ప్రజాశక్తి'ని 1948లో ప్రభుత్వం నాశనం చేయగా నిర్బంధం తర్వాత పున:ప్రారంభమైంది. 1952 తర్వాత 'విశాలాంధ్ర' పత్రిక కమ్యూనిస్టు పత్రికగా అవతరించింది. నార్ల సంపాదకత్వంలో కెఎల్‌ఎన్ ప్రసాద్ 1960లో 'ఆంధ్రజ్యోతి' స్థాపించారు. గోయెంకా కూడా 'ఆంధ్రప్రభ', ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌ను విజయవాడలో ప్రారంభించారు. ఆంధ్రపత్రిక కూడా విజయవాడ తరలొచ్చింది. తర్వాత 'ఆంధ్రపత్రిక' హైదరాబాద్ ఎడిషన్ ప్రారంభించింది. 1967లో సిపిఎం తరపున 'జనశక్తి' పత్రిక నడిచింది. 1974లో విశాఖలో ప్రారంభమైన 'ఈనాడు' తర్వాత హైదరాబాద్‌కు విస్తరించి, 1978లో విజయ వాడ ఎడిషన్ ప్రారంభించింది. ఉగ్రవాదుల విచ్ఛిన్నం తర్వాత 1968లో 'ప్రజా శక్తి' వారపత్రికగా పున:ప్రారంభమై 1981 నుండి దినపత్రికగా వెలువడు తోంది. 1980వ దశకం తర్వాత పత్రికారంగం ఊపందుకుంది. 1984లో 'ఉదయం' ప్రచురణ మొదలైంది. తర్వాత కాలంలో 'ఆంధ్ర భూమి', 'డెక్కన్‌క్రానికల్', 'న్యూస్‌టైమ్', 'వార్త', సూర్య విజయ వాడ ఎడిషన్లు వచ్చాయి.















భారత రాజ్యాంగమే సర్వోన్నతం

75 ఏళ్ల క్రితం అమలులోకి వచ్చిన భారత రాజ్యాంగం కాలపరీక్షకు తట్టుకుని నిలబడింది. 1945 తరువాత స్వాతంత్ర్యం పొందిన అనేక అభివృద్ధిచెందుతున్న దేశాలు, భారత దేశ ఇరుగు, పొరుగు రాజ్యాలు నియంతృత్వ రాజకీయ వ్యవస్థలను కొనసాగిస్తున్నప్పటికీ, భారతదేశం ప్రజాస్వామ్య రాజ్యంగా కొనసాగ డానికి ఒక ముఖ్యకారణం రాజ్యాంగమే. కాని ఇటీవల కాలంలో రాజ్యాంగ లక్ష్యాలు, ఆశయాల పై దాడితోపాటు రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేసే ప్రయత్నం జరుగుతున్నది. ఉప రాష్ట్రపతిగా రాజీనామా చేసిన జగదీప్ ధన్‌కడ్‌తో సహా అనేకమంది అధికారపార్టీ నాయకులు, పార్లమెంట్ సభ్యులు, సంఘ పరివార్ నాయకులు రాజ్యాంగ వ్యవస్థలపై దాడిచేయడం గత కొన్ని సంవత్సరాలుగా జరుగుతున్నది. అందువలన ఇటీవల సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ అనేక సందర్భాలలో 'భారత రాజ్యాంగంమే సర్వోన్నతమైనది' అని ఉద్ఘాటించారు.

రాష్ట్రాల హక్కులు - సుప్రీంకోర్టు తీర్పు

గత దశాబ్దకాలంలో భారత సమాఖ్యలో రాష్ట్రాల హక్కులు హరిస్తూ, సమాఖ్య స్ఫూర్తిని నీరు గార్చారు. జిఎస్‌టి, పెద్దనోట్ల రద్దు, వ్యవసాయ చట్టాలు, జాతీయ విద్యా విధానం- 2020, జమ్ము-కాశ్మీర్‌కు సంబంధించి 370వ ఆర్టికల్ రద్దు మొదలైన చర్యలన్నీ రాష్ట్రాల హక్కులు హరించడంలో భాగమే. తమిళనాడు ప్రభుత్వం తమ బిల్లులను గవర్నర్, రాష్ట్రపతి ఆమోదించచడంలేదని సుప్రీం కోర్టులో కేసు వేసిన నేపథ్యంలో 2025 ఏప్రియల్ 8న సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జెబి పార్థీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్ చారిత్రాత్మకమైన తీర్పు చెప్పారు. తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎస్ రవి 2020-23 మధ్య 12 బిల్లులను ఆమోదించలేదు. రెండు రాష్ట్రపతికి పంపి, 10 బిల్లులను వెనకకు పంపాడు. రాష్ట్ర శాసనసభ ఆ 10 బిల్లులను తిరిగి ఆమోదించి పంపితే, గవర్నర్ పెండింగ్‌లో పెట్టారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు 1952 నుండి యిచ్చిన 18 రాజ్యాంగ ధర్మాసన తీర్పులను, సర్కారియా కమిషన్, పూంచాకమిషన్, రాజమన్నార కమిషన్ నివేదికలను, పరిపాలన సంస్కరణల సంఘం రిపోర్టులను అధ్యయనం చేసి తీర్పు చెప్పింది. తమిళనాడు శాసన సభ ఆమోదించి పంపిన బిల్లులన్నీ ఆమోదం పొందినట్లేనని, ఇక నుండి 3నెలల లోగా బిల్లులకు ఆమోదం ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పులో పేర్కొన్నది. దీనికోసం సుప్రీంకోర్టు రాజ్యాంగంలో ఆర్టికల్ 142 ఉపయోగించింది.

ఈ తీర్పుపట్ల దేశవ్యాపితంగా ప్రజాస్వామ్య వాదులు హర్షం వ్యక్తంచేశారు. కాని భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపతి ముర్మ రాష్ట్రపతికి, గవర్నర్లకు కాలపరిమితి మీరు ఎలా విధిస్తారు, అని ప్రశ్నిస్తూ సుప్రీంకోర్టుకు 14 ప్రశ్నలు వేశారు. రాజ్యాంగంలో 143వ నిబంధన ఉపయోగించి రాష్ట్రపతి ఈ ప్రశ్న వేశారు. సుప్రీంకోర్టు తీర్పుకేంద్ర ప్రభుత్వానికి నచ్చకపోవడం వలనే రాష్ట్రపతి చేత ఈ ప్రశ్నలు అడిగించారని కొంతమంది రాజ్యాంగ నిపుణులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంలో మాజీ ఉప రాష్ట్రపతి జగదీప్‌ధన్‌గడ్ 'సుప్రీంకోర్టు తీర్పు రాష్ట్రపతికి ఆదేశాలు జారీ చేసినది. జడ్జీలు సూపర్‌పార్లమెంట్‌గా వ్యవహరిస్తున్నారు.' అని విమర్శించారు. సుప్రీంకోర్టుతీర్పు స్పష్టంగా రాజ్యాంగం సర్వోన్నతం అని చెప్పినది.

రాజ్యాంగం లౌకిక రాజ్యాంగమే

రాజ్యాంగ పీఠికలో గత 'లౌకిక, సామ్యవాద' భావనలు మొదటినుండి పీఠికలో లేవని, 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారని, వాటిని తొలగించాలని అనేకమంది బిజెపి నాయకులు, బిజెపి పార్లమెంట్ సభ్యులు ప్రకటనలు చేస్తున్నారు. ఆర్‌ఎస్‌ఎస్ కార్యదర్శి హోసబలె ఇటీవల ఆ మేరకు ప్రకటన చేశారు. ఆ రెండు పదాలు సంఘపరివార్‌కు ఏ మాత్రం నచ్చడం లేదు. రాజ్యాంగ నిర్మాతలు స్పష్టంగా సామ్యవాద, సంక్షేమ రాజ్యస్థాపనకు రాజ్యాంగం 4వ భాగంలో ఆదేశిక సూత్రాలు చేర్చారు. రాజ్యాంగం 3వ భాగంలో ప్రాథమిక హక్కులలో ఆర్టికల్ 25 నుండి 28వరకు మత స్వేచ్ఛను కల్పించి, భారతదేశం లౌకిక రాజ్యంగా ఉండాలని భావించారు. ఆర్టికల్ 25 ప్రకారం ప్రతి పౌరుడు తనకు నచ్చిన మతాన్ని స్వీకరిం చవచ్చు, ఆచరించవచ్చు, ప్రచారం చేసుకోవచ్చు. 29, 30 ఆర్టికల్స్ ద్వారా భారతదేశంలో మైనార్టీలు తమ భాషను, లిపిని, సంస్కృతిని, విద్యను అభివృద్ధి చేసుకోవడానికి అవకాశాలు కల్పించాయి. అందువలనే సుప్రీంకోర్టు కేశవనందభారతి వర్సెస్ స్టేట్‌ఆఫ్ కేరళ కేసులో రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని నిర్వచించి, మౌలిక స్వరూప లక్షణాలలో 'లేకిక వాదాన్ని' కూడా పేర్కొన్నది. సుప్రీంకోర్టు ఎస్ఆర్ బొమ్మై వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో లౌకిక విధానం భారత రాజ్యాంగ ప్రాథమిక లక్షణంగా పేర్కొన్నది. ఆధునిక రాజ్యాలు మత రాజ్యాలుగా ఉంటే నియంతృత్వానికి దారి తీస్తుంది. లౌకిక రాజ్యాలుగా ఉంటేనే ప్రజాస్వామ్య రాజ్యాలుగా ఉండగలుగుతాయని వర్తమాన చరిత్ర నిరూపిస్తుంది.

అత్యవసర పరిస్థితి - నాడు : 50 ఏళ్లక్రితం 1975 జూన్ 25న ఆనాటి కేంద్ర ప్రభుత్వం శ్రీమతి ఇందిరాగాంధీ నాయకత్వంలో విధించిన అత్యవసర పరిస్థితి దేశంలో నియంతృత్వానికి దారి తీసింది. 352వ నిబంధన ప్రకారం విధించిన అత్యవసర పరిస్థితి ప్రాథమిక హక్కును సస్పెండ్ చేసింది. మీసా, డిఫెన్స్‌ఆఫ్ ఇండియా చట్టాల ద్వారా లక్షలాదిమందిని అరెస్టులు చేసి జైళ్లలో పెట్టారు. 1973నుండి క్షీణించిన ఆర్థిక పరిస్థితులు, నిరుద్యోగం, అవినీతి, 1974 దేశవ్యాప్త రైల్వే సమ్మె, జయప్రకాష్ నారాయణ నాయకత్వంలో అవినీతి వ్యతిరేక ఉద్యమం, బెంగాల్‌లో అర్ధ-ఫాసిస్ట్ టెర్రర్ మొదలైన వాటితో పాటు 1975 జూన్ 12న రాయబరెలీ నియోజక వర్గం నుండి ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదని అలహాబాద్ హైకోర్టు ప్రకటించడం అత్యవసర పరిస్థితికి దారి తీశాయి. 1975-77 మధ్య దేశవ్యాప్తంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు, ఢిల్లీవంటి ప్రదేశాలలో బ్యూటిఫికేషన్ పేరుతో వేలాది ఇళ్లను కూల్చి వేయడం వంటి దారుణాలు, అత్యాచారాలు జరిగాయి. 1977 మార్చిలో జరిగిన ఎన్నికలలో ప్రజలు పరిపక్వత గలిగిన చైతన్యం ప్రదర్శించి అత్యవసర పరిస్థితికి కారణమైన కాంగ్రెస్‌ను, ఇందిరా గాంధీని ఓడించి జనతాపార్టీని, ఇతర పార్టీలను గెలిపిం చాయి. ప్రజలు ప్రాథమిక హక్కులను, రాజ్యాం గాన్ని కాపాడుకుని, రాజ్యాంగమే సర్వోన్నతమైనదని నిరూపి ంచారు.

అప్రటిత ఎమర్జెన్సీ -నేడు

సమకాలీన భారతదేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతున్నదని అనేక మంది సామాజిక, రాజ్యాంగ నిపుణులు, ప్రజాస్వామ్య వాదులు భావిస్తున్నారు. నాడు 'మీసా' చట్టం అమలు చేయగా నేడు 'ఉపా' చట్టం క్రింద వేలాది మంది జైళ్లలో ఉన్నారు. ప్రొఫెసర్ సాయిబాబ, ఉమర్‌ఖలీద్ లే దీనికి ఉదాహరణ. భావప్రకటనా స్వేచ్ఛ హరించబడి ప్రాథమిక హక్కులు అణిచివేతకు గురవు తున్నాయి. గౌరి లంకేష్, కల్బుర్గి, గోవిందపన్సార్, నరేంద్రబోల్కర్ హత్యలే దీనికి తార్కాణం. నాడు పేదల గుడిసెలు కూల్చివేస్తే నేడు యుపి తో సహా అనేక రాష్ట్రాలలో బుల్డోజర్ పాలన జరుగుతున్నది. రాష్ట్రల హక్కులపై దాడి జరుగుతున్నది. లౌకిక వాదానికి భంగం కలుగుతున్నది. గోరక్షక దళాలపేరుతో మైనారిటీలు, దళితులపై నిరంతర దాడులు జరుగుతున్నాయి. దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ భిన్నమైన రూపాలలో అమలు జరుగుతున్నది. ప్రముఖ పాత్రికేయులు ప్రబీర్ పురకాయస్థ నాడు జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యా యలంలో ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘ నాయకుడిగా అరెస్టు అయితే, నేడు న్యూస్ క్లిక్ సంపాదకుడిగా ఉండి ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాస్తున్నారనే పేరుతో అరెస్టు చేసి జైలులో పెట్టారు. ఈ నాటి కేంద్ర ప్రభుత్వ అప్రకటిత ఎమర్జన్సీ విధానాల నుండి దేశాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత రాజకీయపార్టీలు, పౌరసంఘాలు, పౌరసమాజం, మేధావులపై ఉన్నది. రాజ్యాంగం సర్వోన్నతమైనది.

- కెఎస్.లక్ష్మణరావు, మాజీ ఎంఎల్‌సి













తెలుగునాట సంస్కరణోద్యమ వేగుచుక్క కందుకూరి

వితంతువుల పేర సాగుతున్న సాంప్రదాయాలకు వ్యతిరేకంగా, వితంతు వివాహాలు చేసేందుకు 1870ల లోనే కందుకూరి వీరేశలింగం తెలుగునాట సంస్కరణ ఉద్యమం నడిపాడు. కష్టాలు, వ్యతిరేకతలు, ఛీత్కా రాలు ఎదురైనా ధైర్యంగా ముందుకు సాగాడు. హేతు వాది, రచయిత, కవితా వైతాళి కుడు అయిన కందుకూరి వీరేశ లింగం వితంతువుల పునరావాస, శరణాలయాలు స్థాపించాడు. బాలికలకు ప్రత్యేకంగా రాజమండ్రిలో పాఠశాల స్థాపించి తెలుగునాట సంస్కరణోద్యమ 'వేగుచుక్క'గా వెలుగొందాడు. చిన్ననాటి నుంచే మూఢనమ్మకాలకు వ్యతిరేకం చిన్నారి బాలికలకు ముసలి వారితో వివాహాలు చేసే రోజులవి. వితంతువులు మరలా పెళ్లి చేసుకోరాదనే మూఢాచారం అమలులో వున్న సాంఘిక పరిస్థితులలో కందుకూరి వీరేశలింగం



1848 ఏప్రిల్ 16న రాజమండ్రిలో సుబ్బారాయుడు, పున్నమ్మ దంపతులకు జన్మించాడు. బడిలో పాఠాలు ఒక్కసారి చదివితే చాలు కంఠతా వచ్చేసేవి. ఇంట్లో అటక మీద వున్న తాటాకు పుస్తకాలు తీసి చదివేవాడు. దాంతో తెలుగు మీద అభిమానం పెంచుకున్నాడు. బడిలో చదువు, సత్ప్రవర్తనలో వీరేశలింగందే అగ్రస్థానం. తాము ఎన్ని ఇబ్బందుల్లో వున్నా తల్లిదండ్రులు వీరేశలింగం చదువును మాత్రం మాన్పించలేదు. వీరేశలింగానికి జబ్బు చేస్తే ఎవరో తన కుమారుడికి చేతబడి చేశారని భూతవైద్యుని పిలిపించి వైద్యం చేయించడానికి ప్రయత్నిం చింది తల్లి. ఆ భూత వైద్యుడిని వీరేశలింగం వివిధ ప్రశ్నలు వేయడంతో అతను భయపడి పారిపోయాడు. ఇంటికి వెళ్లాక అనారోగ్యం పాల య్యాడు. పైగా వీరేశలింగం తనకే చేతబడి చేశాడని భయపడిపోయాడు. దీంతో అతని ఇంటికి వెళ్లి ధైర్యం చెప్పి ఆరోగ్యం కుదుట పర్చాడు వీరేశలింగం. దెయ్యాలు, భూతాలు లేవంటూ వాదించేవాడు. తోటి వారితో సవాలు చేసి, అమావాస్యనాడు అర్ధరాత్రి శ్మశానానికి వెళ్లి తెల్లవారి తిరిగొచ్చి... ఒక్క దెయ్యం కూడా కనపడలేదని దెయ్యాల పేరుతో భయాలు అనవసరం అని చాటి చెప్పాడు. వీరేశలింగానికి 13వ ఏట ఏడేళ్ల రాజ్యలక్ష్మితో వివాహం జరిగింది. వారిద్దరూ తెలుగు నాట సంస్కరణోద్యమాలకు తోడ్పడ్డారు. వీరేశలింగం రాజమండ్రిలో ఒక సంవత్సరం పాటు ఉపాధ్యాయుడిగా పని చేశాడు. 1872వ సంవత్సరంలో కోరంగిలో ఇంగ్లీషు పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా ఉద్యోగం లభించింది. మూఢ నమ్మకాలు, ఆచారాల మీద నమ్మకాలు మారిపోయాయి. కోరంగి స్కూలులో చేరటానికి అమావాస్య నాడు వెళ్లే ముహూర్తం నిర్ణయించుకున్నాడు. భూమి సూర్యుడు చుట్టు తిరగడం వల్ల ఏర్పడే సంవత్సరం లోని రోజులలో మంచి రోజులు, చెడు రోజులు అనే తేడాలు చూడడం మూఢత్వం, అజ్ఞానమని తన చర్య ద్వారా తెలియచెప్పాడు.

సంఘ సంస్కరణలు - వితంతు వివాహాలు

సనాతన భావాలు, మత సాంప్రదాయ కుటుంబానికి చెందిన వీరేశలింగం విద్యార్థి దశ లోనే ముఖానికి విభూది రేఖలు, మెడలో లింగకాయ తీసివేశాడు. మత చిహ్నాలను తొలగించుకోవడం ద్వారా ప్రారంభమైన సంస్కరణ కార్యక్రమం... జీవితాంతం అనేక కష్టాలు, ఇబ్బందులు ఎదురైనా నిరంతరం కొనసాగింది. 1874లో మిత్రులతోకలిసి సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై ప్రచారం చేసేందుకు 'వివేకవర్ధని' పత్రికను స్థాపించాడు. తెలుగు ప్రజా సమాజంలో వున్న అవలక్షణాలకు, అధికారుల లంచగొండి తనానికి, మూఢాచారాలకు వ్యతిరేకంగా ప్రచారం చేశాడు. చిన్నప్పుడే పెళ్లయిన అమ్మాయిలు, భర్త చనిపోతే జీవితాంతం వితంతువుగానే పడి ఉండాల్సిందేననే దురాచారం అమలులో వుండేది. దీనిపై చలించిన వీరేశలింగం తన మిత్రులతో కలిసి స్త్రీల పునర్వివాహాలను గూర్చి బహిరంగ సభల ద్వారా ప్రచారం చేశాడు. రాజమండ్రిలో మిత్రులతో కలసి 1878 సెప్టెం బరు 8న 'సంఘ సంస్కరణ' సమాజం స్థాపించాడు.

మూఢాచారాలకు వ్యతిరేకంగా కృషి

స్త్రీల పునర్వివాహం కోసం వీరేశలింగం జరిపిన కృషిని, ప్రచారాలను మొదటి నుండి అనేక మంది వ్యతిరేకించారు. కొన్ని సందర్భాలలో మూర్ఖులు వీరేశలింగంపై ప్రత్యక్ష దాడులకు సిద్ధపడిన సంఘటనలూ వున్నాయి. అభ్యుదయ వాదులైన విద్యార్థులు, యువకులు ఆయనకు తోడ్పడేవారు. వితంతు పునర్వివాహాల గురించి ప్రజలలో బాగా స్పందన వచ్చింది. వధూవరుల కోసం రాత్రిళ్లు ప్రయాణాలు చేయడం, ఆడపిల్లలకు మగవేషాలు వేయడం, వాళ్లను ఎత్తుకొని మైళ్ల కొద్దీ నడవడం వంటి తెగువ చూపాడు. తన ఇంటికి చేరిన వితంతువులను భార్య రాజ్యలక్ష్మితో కలసి కాపాడి వివాహాలు చేశాడు. బంధువులు, మిత్రులు, ఆప్తులు వ్యతిరేకించినా ఇబ్బందులొచ్చినా ఏనాడూ ఒక్కడుగు వెనక్కి వేయలేదు. కొద్ది సంవత్సరాల కాలంలోనే 112 వితంతు వివాహాలు జరిపించాడంటారు. అంతేగాక, స్త్రీ విద్య కోసం బాలికల పాఠశాలలు, కళాశాల నిర్మించాడు. రాత్రి పాఠశాలలు కూడా నడిపాడు. ఆయన జీవితాంతం స్త్రీల అభ్యున్నతి కోసం జరిపిన కృషి ఉత్తుంగ తరంగ సముద్రంలో ఎదురీతగా చెప్పవచ్చు. నేడు దేశంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు, వరకట్న హత్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ పరిస్థితులలో విద్యార్థులు, యువతరం అభ్యుదయ వాదులుగా వ్యవహరించాలి. కందుకూరి వీరేశలింగం స్ఫూర్తితో నేటి దురాచార రూపాలకు వ్యతిరేకంగా పని చేయడం ఎంతైనా అవసరం.

> అందమైన బాహ్య రూపం
> ఎప్పుడైనా మోసం చెయ్యవచ్చు.
> కానీ విప్లవం పట్ల నిబద్ధత గల
> ఆత్మ సౌందర్యం ఏనాటికీ మోసం
> చెయ్యదు.
> - మావో

చదివిన పాఠశాలకే హెచ్‌ఎంగా తోట పోతురాజు



అవగాహనా ర్యాలీలో పాల్గొన్న పోతురాజు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - ఉంగుటూరు



తాను చదివిన పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసే అరుదైన అవకాశాన్ని చేబ్రోలుకు చెందిన తోట పోతురాజు సొంతం చేసుకున్నారు. ఉంగుటూరు మండలం నారాయణపురం వివేకానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు చదివిన (1988-89 టెన్త్ బ్యాచ్) పూర్వ విద్యార్థి పోతురాజు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆకివీడు నుంచి నారాయణపురం జెడ్‌పి ఉన్నత పాఠశాలకు వచ్చారు. ఆయన తొలి ఉద్యోగం నిడమర్రు మండలం గుణపర్రు. అక్కడ నుంచి పత్తేపురం, పెదనిండ్రకొలను, కైకరం, ఎంఎం.పురం పాఠశాలల్లో ఉపాధ్యాయునిగా పనిచేసి హెడ్ మాస్టర్‌గా 2023లో ఉద్యోగోన్నతిపై పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు జెడ్‌పి ఉన్నత పాఠశాలకు వెళ్లారు. అక్కడ నుంచి సాధారణ బదిలీల్లో ఆయనను నారాయణపురం జెడ్‌పి ఉన్నత పాఠశాలకు అధికారులు ట్రాన్స్‌ఫర్ చేశారు. తాను చదివిన పాఠశాలలో హెడ్ మాస్టర్‌గా పనిచేసే అవకాశం రావడం ఎంతో సంతోషంగా ఉందని, విద్యాప్రమాణాలు, క్రమశిక్షణతో విద్యను అందించేందుకు తన వంతు కృషి చేస్తానని పోతురాజు తెలిపారు. పూర్వ విద్యార్థులు, మిత్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలోనే ఇదే పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు వివిధ సజ్జెక్టుల ఉపాధ్యాయులుగా పనిచేశారు.

పోతురాజు రాకతో మారిపోయిన రూపురేఖలు

పూర్వ విద్యార్థుల వితరణలు

చేబ్రోలుకు చెందిన పోతురాజు నారాయణపురం హైస్కూల్‌లో చదివారు. ఆయన హెచ్‌ఎంగా వచ్చాక అతని మిత్రబృందం (1988-89 బ్యాచ్) సహకారంతో రూ.35 వేలతో సీసీ కెమెరాలు, మరో పూర్వ విద్యార్థి శీతాల వినాయకరావు దేశనాయకుల ఫొటో ఫ్రేమ్‌లను రూ.ఎనిమిది వేలతో ఏర్పాటు చేశారు. పోతురాజు తన సొంత ఖర్చులతో పాఠశాల కార్యాలయం గది మొత్తాన్ని రీ మోడలింగ్‌తో నూతన హంగులతో అహ్లాదకరంగా తీర్చిదిద్దారు. అమెరికాలో ఉంటున్న యడ్లపల్లి నాగశ్రీను రూ.లక్ష విరాళాన్ని ఇటీవలే అందించారు. వాటిని పాఠశాల మౌలిక సదుపాయాల కోసం వినియోగించనున్నారు. ఈ పాఠశాలలో పదో తరగతి చదవిన విద్యార్థులు గుడ్ల హర్ష ప్రియ, జుత్తుగ అభినయశ్రీలు ట్రిపుల్ ఐటీ సీటు సాధించారు.

మోడల్ హైస్కూలుగా తీర్చిదిద్దుతా..

తోట పోతురాజు, హెచ్‌ఎం, నారాయణపురం జెడ్‌పిహెచ్ స్కూల్

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు హైస్కూలు హెడ్ మాస్టర్‌గా దాదాపు 1400 మంది విద్యార్థులు, 58 మందికి పైగా ఉపాధ్యాయులతో విజయవంతంగా పాఠశాలను నడిపిన అనుభవంతో నేను చదివిన నారాయణపురం హైస్కూలును మోడల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాను. నా బాల్య మిత్రులు, చిన్ననాటి స్నేహితులు, పూర్వ విద్యార్థుల సహకారంతో మౌలిక సదుపాయాలను కల్పించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాను. మరో పక్క ప్రస్తుతం నడుస్తున్న విద్యా సంవత్సరంతో ఈసారి పదో తరగతి ఫలితాల్లో గతం కంటే ఉన్నత స్థితికి తీసుకెళ్లేలా ఉపాధ్యాయుల సహకారంతో కృషి చేస్తున్నాను.

పాఠశాల ప్రగతికి కృషి

ఉంగుటూరు జెడ్‌పిహెచ్ స్కూల్ హెచ్‌ఎం రాజారవీంద్ర




ఉంగుటూరు పాఠశాల ప్రవేశ ద్వారం

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని ప్రధానోపాధ్యాయులు ఎం.రాజారవీంద్ర అన్నారు. ఆయన ఇటీవల ఉద్యోగోన్నతిపై హెచ్‌ఎంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో మాట్లాడుతూ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పంపిణీపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఉపాధ్యాయులతో వారికి అదనపు క్లాసులు చెప్పించి విద్యాప్రమాణాలు పెంచుతున్నామన్నారు. పాఠశాల గ్రౌండు పల్లంగా ఉండి వర్షాకాలం నీరు నిలిచిపోతోందని, దీనికి పరిష్కారంగా మొన్న వేసవిలో కూటమి ప్రభుత్వం రూ.తొమ్మిది లక్షలతో మెరక పనులు చేయడంతో క్రీడామైదానం సువిశాలంగా ఉండి విద్యార్థులు ఆడుకోవటానికి ఎంతో అనువుగా ఉందని చెప్పారు. పాఠశాలకు అవసరమైన మౌలిక వసతుల కోసం నిధుల మంజూరు కోరుతూ ఎంఎల్‌ఎ ధర్మరాజుకు వినతిపత్రం అందించినట్లు తెలిపారు. రోడ్డు భద్రతా వింగ్ డిఐజి సిహెచ్.విజయరావు ఈ పాఠశాల పూర్వ విద్యార్థి కావడం విశేషం. ఆయన సొంతూరు ఉంగుటూరు పక్కనే ఉన్న నీలాద్రిపురం గ్రామమే.



మెరక చేసిన ఉంగుటూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల క్రీడా మైదానం



విప్లవ పథంలో పయనించే వీరయోధులు,
ప్రతి పరాజయం నుంచీ కొత్త శక్తిని కూడగట్టుకుంటారు.
చరిత్ర ప్రవాహంలో ఎంతగా ఈదులాడితే,
మనోధైర్యం అంతగా పెరుగుతుంది.

\- కార్ల్ మార్క్స్

'మానస'లో ఉన్నత విద్యాప్రమాణాలు


మానస ఇంగ్లీష్ మీడియం హైస్కూల్

హైస్కూల్ ప్రిన్సిపల్ యలమర్తి రవీంద్రకుమార్


రవీంద్రకుమార్


మోక్షిత్ సాయి జశ్వంత్


యు.నాగ సాత్విక్


పి.బాంధవ్య

ప్రజాశక్తి - భీమడోలు

మానస ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఉన్నత విద్యాప్రమాణాలతో కూడిన విద్య అందిస్తున్నామని ఆ పాఠశాల ప్రిన్సిపల్ యలమర్తి రవీంద్రకుమార్ తెలిపారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ సుమారు 90 మంది విద్యార్థులతో 2002లో మానస ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ప్రారంభించినట్లు వివరించారు. ఆ రోజుల్లోనే భీమడోలు వంటి గ్రామంలో ఉన్నత విద్యాప్రమాణాలతో బోధన సాగించడంతో అందరి దృష్టి ఆకర్షించిందన్నారు. గ్రామస్థాయి విద్యార్థులకు విలువైన విద్యను అందించడం మాత్రమే కాకుండా విద్యార్థులు వివిధ రంగాల్లో ఉన్నత స్థానాలను సాధించేలా గత 23 సంవత్సరాలుగా పనిచేస్తుందని తెలిపారు. గ్రామీణ విద్యార్థులకు అందుబాటులో ఉండే ఫీజులతో కార్పొరేట్ స్థాయి విద్య, ఐఐటి, నీట్ ఫౌండేషన్, సాంస్కృతిక అంశాలు, వసతులు, బస్సులు వంటి అన్ని సౌకర్యాలను అందిస్తుందన్నారు. ఇప్పటికే ఇక్కడ చదువుకుని వెళ్లిన విద్యార్థులు ఎందరో ఐఐటి, నిట్, నీట్ ర్యాంకులు సాధించడం, ప్రభుత్వ, ప్రయివేట్ రంగాల్లో మంచి ఉద్యోగాలు సాధించడం, విదేశాల్లో సైతం ఉన్నత స్థాయిలో ఉద్యోగాలు సాధించారని వివరించారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు మంచి విద్యతోపాటు క్రమశిక్షణ, సత్ప్రవర్తన, మానవత్వం, సామాజిక స్పృహ, విలువలు కలిగి ఉండేలా మొదటి నుంచి శిక్షణ ఇస్తు న్నామని చెప్పారు. నేటి పోటీ ప్రపంచానికి కావాల్సిన కంప్యూటర్ శిక్షణ, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంగ్లీష్ భాషపై పట్టు, మూడో తరగతి నుంచే కాంపిటేటివ్ పరీక్షల విధానంలో తరచూ పరీక్షలు నిర్వహించడం, విద్యార్థులకు మానసిక వికాసానికి కావాల్సిన అనేక కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల శారీరక వికాసానికి అలాగే పోటీతత్వాన్ని పెంపొందించడానికి చాలా రకాల ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ఇస్తున్నట్లు రవీంద్రకుమార్ వివరించారు. ఇలా అన్ని రంగాల్లోనూ కచ్చితమైన విధానాలు పాటించడాన్ని గుర్తించిన అప్పటి కలెక్టర్ 2017లో రాష్ట్ర ప్రభుత్వం తరఫున తనకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కూడా ఇచ్చారని తెలిపారు. భీమడోలు గ్రామంలో విద్యార్థులకు మానస ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ఒక విలువైన విద్యకు వేదికగా మారి ఇప్పుడు రెండు వేల మందికి పైగా విద్యార్థులకు విద్యను అందిస్తూ అ ప్రాంతంలోనే నెంబర్ వన్ స్కూలుగా నిలిచిందని చెప్పారు.